సమష్టి కృషికి పురస్కారం


అవార్డు అందుకున్న గ్రీన్ అంబాసిడర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎంపీ, జేసీ తదితరులు

ప్రోత్సాహంతోనే అభివృద్ధి సాధ్యం
ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ
ఘనంగా స్వచ్ఛాంధ్ర అవార్డుల ప్రదానోత్సవం

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): సమష్టి కృషితోనే జిల్లాకు స్వచ్ఛాంధ్ర రాష్ట్రస్థాయి పురస్కారం దక్కిందని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. జిల్లా స్థాయి స్వచ్ఛాంధ్ర అవార్డుల ప్రధానోత్సవంలో సోమవారం ఆయన ప్రసంగించారు. జిల్లా కేంద్రం లోని ఓ హోటల్‌లో ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు. నగర పాలక సంస్థ కమిషనర్ బాలస్వామి, డీపీఓ నాగరాజ నాయుడు జరిగి ఈ కార్యక్రమానికి ఎంపీ అంబికా, జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రాష్ట్రస్థాయి స్వచ్ఛాంధ్ర అవార్డు జిల్లాకు రావడం చాలా సంతోషంగా ఉందని ఎంపీ అన్నారు. అన్ని వర్గాలవారిని, అన్ని విధాలుగా ప్రోత్సహిస్తేనే అభివృద్ధి సాధ్యమౌతుందని అన్నారు. జిల్లాకు మంచి చేసేందుకు పార్లమెంటులో తన శక్తి వంచన లేకుండా పోరాటం చేస్తానని అన్నారు.


మాట్లాడుతున్న ఎంపీ అంబికా

ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనా విధానంతో అన్ని రంగాల్లో ముందుకు వెళ్లగలుగుతున్నామని అన్నారు. స్వచ్ఛత కార్యాక్రమాలలో అందరూ భాగం కావడం శుభపరిణామమని అన్నారు.

తాడిపత్రిని ఆదర్శంగా తీసుకోవాలి: జేసీ

రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపికైన తాడిపత్రి మున్సిపాలిటీని ఆదర్శంగా తీసుకుని, మిగిలిన ప్రాంతాలు పోటీపడి ఫలితాలు సాధించాలని జేసీ శివనారాయణ శర్మ అన్నారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది ఎంతో కష్టపడి పనిచేశారని, అందుకే అవార్డులు సాధ్యమయ్యాయని అభినందించారు. పరిశుభ్రత ఎంతో పవిత్రమైనదని, పరిశుభ్రతతోనే ఆరోగ్యం సాధ్యమని అన్నారు. వచ్చే ఏడాది మరింత కష్టపడి పనిచేసి జాతీయ స్థాయి అవార్డులు సాధించాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో మరిన్ని అవార్డులు సాధించాలని, అందుకు సిబ్బంది సహకారం అవసరమని అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్ అన్నారు. జిల్లాలో 54 మందికి అవార్డులు రావడం సంతోషకరమని అన్నారు. ఇదే స్ఫూర్తితో ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఆర్వో మలోల, జడ్పీ సీఈఓ శివశంకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్, డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి, సమగ్ర శిక్ష ఏపీసీ శైలజ, బీసీ సంక్షేమ శాఖ డీడీ ఖుష్బూ కోఠారి, మెప్మా పీడీ విశ్వజ్యోతి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అనిల్, బానుజ తదితరులు పాల్గొన్నారు.


సీఎం చంద్రబాబు చేతుల మీదుగా స్వచ్ఛ అవార్డు అందుకుంటున్న కలెక్టర్ ఆనంద్

సీఎం నుంచి అవార్డు అందుకున్న కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ జిల్లా అవార్డు-2025ను కలెక్టర్ ఆనంద్ సోమవారం అందుకున్నారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో స్వచ్ఛాంధ్ర అవార్డులు-2025 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా స్వచ్ఛ జిల్లా అవార్డును కలెక్టర్ అందుకున్నారు.

సేవలకు జాతీయ సత్కారం
రాష్ట్రపతి నుంచి అవార్డు అందుకున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్ పృథ్వీరాజ్


రాష్ట్రపతి ముర్ము నుంచి అవార్డు అందుకుంటున్న పృథ్వీరాజ్

శెట్టూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ద్వారా సామాజిక సేవాకార్యక్రమాల్లో విశిష్ట కృషిచేసిన జిల్లాకు చెందిన ముమ్ముల పృథ్వీరాజ్‌కు జాతీయ స్థాయిలో అవార్డు లభించింది. రాష్ట్రపతి ద్రౌపదిముర్ము జాతీయ ఉత్తమ ఎన్ఎస్ఎస్ వలంటీర్ అవార్డును సోమవారం ఆయనకు ప్రదానం చేశారు. శెట్టూరు మండలం చిన్నంపల్లికి చెందిన ముమ్మల ఈశ్వరప్ప, రత్నమ్మ దంపతుల పెద్దకుమారుడు పృథ్వీరాజ్ నెల్లూరు విక్రమ సింహపురి యూనివర్సిటీలో పృథ్వీరాజ్ బయోటెక్నాలజీ పూర్తి చేశారు. ఎన్ఎస్ఎస్ ద్వారా ఆయన మూడేళ్లపాటు రక్తదానం, మొక్కలు నాటడం, పచ్చదనం-పరిశుభ్రత, మహిళా సాధికారత, జాతీయ సమైక్యతా శిబిరం, గ్రామీణాభివృద్ధి, ఆరోగ్య శిబిరాలు, పర్యావరణం పరిరక్షణ వంటి సామాజిక సేవకార్యక్రమాల్లో పాల్గొని పలువురి ప్రశంసలందుకున్నారు. ఈ సేవలకుగాను పృథ్వీరాజ్ జాతీయ ఉత్తమ ఎన్ఎస్ఎస్ వలంటీరు అవార్డుకు ఎంపికయ్యారు. దీంతో సోమవారం న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా పృథ్వీరాజ్‌ను వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ అల్లం ఉదయ్ శంకర్ తదితరులు అభినందనలు తెలిపారు.

సూపర్ జీఎస్టీపై
అవగాహన కల్పించండి: కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్‌పై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై జేసీ శివనారాయణశర్మ, డీఆర్ఓ మలోల, కమర్షియల్ టాక్స్ జాయింట్ కమిషనర్ హేమ, ఆయా శాఖల జిల్లా అధికారులు, ఎంపీడీఓలతో కలెక్టర్ సోమవారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న జీఎస్టీ 2.0 సంస్కరణలు, సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై సెప్టెంబరు 25 నుంచి ఈనెల 19వరకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. షెడ్యూలింగ్, డాక్యుమెంటేషన్ చాలా ముఖ్యమని, జిల్లా, మున్సిపల్, మండల, గ్రామ స్థాయిలో షెడ్యూల్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్‌పై మండల, మున్సిపాలిటీ స్థాయిలో పలు చోట్ల సమావేశాలు, ట్రాక్టర్ ర్యాలీల నిర్వహణ తక్కువగా ఉందన్నారు. నిర్వహించినా వాటికి డాక్యుమెంట్ల అప్లోడ్ పెండింగ్ ఉం దని, వాటిని ఒకరోజులోపు పూర్తి చేయాలన్నారు. సెలూన్లు, స్పాలు, యోగా సెంటర్లు, జిమ్‌ల వద్ద జీఎస్టీ ధరల మార్పులు ప్రదర్శించేలా చూడాలన్నారు. ఎంఎస్ఎంఈ యూనిట్లలో, ఆప్కో, లేపాక్షి, వన్ డిస్ట్రిక్ట్ వన్ క్యాంపెయిన్‌ల పరిధిలో సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై ఎగ్జిబిషన్, అవగాహన ప్రచారాలు నిర్వహించాలన్నారు. పాఠశాలలు, కళాశాలలు, అన్ని విద్యా సంస్థల్లో షెడ్యూల్ చేసుకోవాలని, కాంపిటీషన్లు నిర్వహించాలని, విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఇతర శాఖల అధికారులతో వాణిజ్య పన్నుల శాఖ అధికారులు సమన్వయం చేసుకుని నిర్వహించాలన్నారు.

కార్పొరేట్ స్కూళ్లలో
దొంగలు పడ్డారు

కేశవరెడ్డి, నారాయణ, గ్లోబల్, ఎడిఫై పాఠశాలల్లో చోరీలు
రూ.2.50 లక్షలు అపహరణ
దుండగులు అందరూ యువకులే..!



కేశవరెడ్డి పాఠశాలలో దొంగలు (సీసీ టీవీ ఫుటేజీ)

బుక్కరాయసముద్రం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ స్కూళ్లలో దొంగలు పడ్డారు. మండలంలోని వడియంపేట గ్రామ సమీపాన 44వ నంబరు జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న నాలుగు కార్పొరేట్ పాఠశాలల్లోకి సోమవారం తెల్లవారుజామున దొంగలు పడి, రూ.2.50 లక్షల నగదు అపహరించారు. ఐదుగురు దుండగులు వరుస చోరీలకు పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. వారు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సోములదొడ్డి సమీపాన గల కేశవరెడ్డి, నారాయణ, గ్లోబల్, ఎడిఫై స్కూళ్లలో విద్యార్థుల నుంచి ఫీజుల రూపంలో వసూలు చేసిన సొమ్మును సిబ్బంది బీరువాల్లో ఉంచారు. ఈ నేపథ్యంలో ఐదుగురు దుండగులు మాస్కులు, టోపీలు, మఫ్లర్లు ధరించి సోమవారం తెల్లవారుజామున తొలుత గ్లోబల్ పాఠశాలలో చొరబడ్డారు. బీరువా బద్దలుకొట్టి, అందులోని రూ.20 వేలు అపహరించారు. అక్కడి నుంచి సమీపంలోని నారాయణ స్కూల్‌లోకి చొరబడి, రూ.10వేలు, ఆ తరువాత ఎడిఫై పాఠశాలలో రూ.20వేలు చోరీ చేశారు. చివరగా కేశవరెడ్డి కాన్సెప్ట్ స్కూల్‌లో చొరబడి రూ.2లక్షలు అపహరించారు. రూ.8లక్షల నగదు పోయినట్లు పాఠశాల యాజమాన్యం తొలుత ఫిర్యాదు చేసింది. అనంతరం ఫీజు రిసిప్ట్‌ల ఆధారంగా పరిశీలించి, రూ.2లక్షలు చోరీ అయినట్లు తేల్చారు. నాలుగు విద్యాసంస్థల్లో కలిపి రూ.2.50లక్షలు అపహరించారు. ఉదయం చూసుకున్న పాఠశాల సిబ్బంది.. పోలీసులకు సమాచారం అందించారు. అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ పుల్లన్న, పోలీసు బృందం పరిశీలించి, యాజమాన్యాలతో మాట్లాడారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంతో పరిశీలించారు. సీసీ టీవీ ఫుటేజీలోల ఐదుగురు దుండగులు.. అందరూ 25 ఏళ్లలోపు వారు చోరీ చేసినట్లు గుర్తించారు. చోరీలపై బుక్కరాయసముద్రం పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు. నిందితుల కోసం ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి, గాలింపు చర్యలు చేపడుతున్నట్లు సీఐ తెలిపారు.

ప్రణాళికతోనే..

దుండగులు.. ప్రణాళిక ప్రకారంగానే స్కూళ్లలో చోరీలు చేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. ప్రస్తుతం దసరా సెలువులు పూర్తయి విద్యార్థులు తిరిగి పాఠశాలల్లో చేరిపోతున్నారు. ఈ నేపథ్యంలో పెండింగ్ ఉన్న ఫీజులు చెల్లించి ఉంటారని భావించి, దొంగలు చోరీలకు పాల్పడి ఉంటారని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

నెట్టికంటికి
తొలగిన అడ్డంకి..

- ఆలయం వద్ద దుకాణాల తొలగింపు
- పదిహేనేళ్ల ఆలోచన సాకారం
- సమూలంగా మారనున్న కసాపురం ఆలయ ముఖచిత్రం


ఆలయం ముందు దుకాణాలు తొలగించాక..

గుంతకల్లు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): కసాపురంలోని శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానం ముఖచిత్రం మారిపోనుంది. సుందరీకరణ దిశగా దక్షిణ గోపురం ఎదురుగా ఉన్న దుకాణాలను తొలగించే కార్యక్రమం ఎట్టకేలకు సాకారమైంది. ఆలయం ముందుభాగంలో ఎటువంటి అడ్డంకి లేకుండా చేసి, దూరం నుంచే దేవస్థానం ముఖచిత్రం కనిపించేలా అత్యద్భుతంగా తీర్చిదిద్దే కార్యక్రమానికి 2010లో రూపకల్పన చేశారు. షాపులను మరో చోటికి తరలించాలని ఆలయ అధికారులు యత్నించినపుడల్లా దుకాణాల నిర్వాహకులు.. రాజకీయ ఒత్తిళ్లతో కార్యక్రమాన్ని దాటవేస్తూ వచ్చారు. 15 ఏళ్లలో ఇక్కడకు వచ్చిన ప్రతి కార్యనిర్వాహణాధికారీ దుకాణాల షిఫ్టింగ్ విషయంగా ప్రయత్నించి విఫలమయ్యారు. ప్రస్తుత ఈఓ విజయరాజు కూడా నెల కిందట దుకాణాల తొలగింపు విషయంగా అంగళ్ల నిర్వాహకులతో పలుమార్లు చర్చించారు. దుకాణాలను తొలగించకుండా ఉండేందుకు నిర్వాహకులు తమ వాదనను వినిపిస్తూనే వచ్చారు.

అన్నవరం ఘటనతో..

అన్నవరం దేవస్థానంలో జరిగిన ఓ ఘటన కసాపురం దేవస్థానం ఎదుట ఉన్న దుకాణాల తొలగింపు వేగవంతం చేయడానికి కారణమైంది. అన్నవరం దేవస్థానం ఎదుట ఉన్న ఓ అంగడిలో గ్యాస్ సిలిండరు పేలి ఎదురుగా ఉన్న ఆలయ గోపురంపై పడడంతో దేవదాయ శాఖ అప్రమత్తమైంది. రాష్ట్రంలో ఇటువంటి పరిస్థితులు ఉన్న చోట్ల దుకాణాలను తొలగించాలంటూ దేవదాయ శాఖ ఉత్తర్వులు జారీచేసింది. దీంతో కసాపురంలో దుకాణాల తొలగింపునకు మార్గం సుగమమైంది. అంగళ్ల తొలగింపుపై ఆలయ అధికారులు.. దుకాణదారులకు రెండు రోజుల కిందట చివరిసారిగా హెచ్చరికలు చేశారు. ఆదివారం ఎక్స్‌కవేటర్లను తెప్పించి దుకాణాల్లోని వస్తువులను బయటపెట్టించి, తొలుత 27 శాశ్వత భవన సముదాయాన్ని తొలగించారు. దీంతో దేవస్థాన స్థలంలో తాత్కాలిక షెడ్లను నిర్మించుకుని ఏర్పాటు చేసుకున్న దుకాణాలను వ్యాపారులు సోమవారం స్వచ్ఛందంగా తొలగించుకున్నారు. దక్షిణ గోపురం ఎదుట, సులభ్ కాంప్లెక్స్ దిగువన, కల్యాణ కట్ట వద్ద ఉన్న 65 దుకాణాల తొలగించేశారు. దీంతో ఆలయం ఎదుట ఖాళీ స్థలం ఏర్పడడంతో దేవస్థానం ముందుభాగం దూరం నుంచే చూసేలా అడ్డంకులు తొలగిపోయాయి. అంగళ్లు, పార్కులు ఉన్న చోట్ల నేలను చదునుచేసి, దేవాలయ దక్షిణ గోపుర దృశ్యాన్ని సుందరీకరిస్తామని ఈఓ పేర్కొన్నారు.

పది రోజుల్లో ప్రత్యామ్నాయం

ఆలయం ఎదుట ఉన్న దుకాణాలను మంగళవారానికి పూర్తిగా తొలగిస్తాం. వారికి పదిరోజుల్లో ప్రత్యామ్నాయంగా షెడ్లను నిర్మించి ఇస్తాం. ప్రస్తుతం ఉన్న దుకాణదారులందరికీ పాత బకాయిలు లేకుంటే అంగళ్లు పెట్టుకోవడానికి పూర్తిగా సహకరిస్తాం. మొత్తంమీద వంద షాపులను ఏర్పాటుచేయడానికి రూపకల్పన చేశాం. మిగిలే దుకాణాలను టెండరు కం వేలం ద్వారా కేటాయిస్తాం.

-విజయరాజు, కార్యనిర్వహణాధికారి, కసాపురం దేవస్థానం

ఆలయం ఎదుట తొలగించిన దుకాణాలు


రిజిస్ట్రేషన్ చేయించకుండా బెదిరిస్తున్నారు

ఎస్పీకి బాధితుడి ఫిర్యాదు.. పీజీఆర్ఎస్‌కు 88 అర్జీలు

అనంతపురం క్రైం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): తాము కొనుగోలు చేసినప్పుడు వేల రూపాయల్లో ఉన్న స్థలం విలువ ఇప్పుడు రూ.కోట్లకు చేరిందని, దీంతో రిజిస్ట్రేషన్ చేయించకుండా బెదిరిస్తున్నారని తిరుపతికి చెందిన చెరిష్మా హౌసింగ్ కంపెనీ డైరెక్టర్లపై ఎరుకల దేవాంజనేయులు అనే వ్యక్తి ఎస్పీ జగదీష్‌కు ఫిర్యాదు చేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వివిధ ప్రాంతాల బాధితులు 88 అర్జీలు సమర్పించారు. ఫిర్యాదులను పరిశీలించిన ఎస్పీ, సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో మాట్లాడి, వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కుటుంబ కలహాలు, వేధింపులు, ఇతర సమస్యలపై ఫిర్యాదులు వచ్చాయి. నగరంలోని రాజీవ్ కాలనీకి చెందిన దేవాంజనేయులు స్థలం సమస్యపై ఫిర్యాదు చేశారు. 1998-2000 మధ్యకాలంలో చెరిష్మా కంపెనీ డైరెక్టర్లు స్థలాల విక్రయం పేరిట ప్రజల నుంచి రూ.2 వేల చొప్పున నెలవారీ కంతులు వసూలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. డైరెక్టర్ శ్రీదేవి భర్త మురళీకృష్ణకు తాను అగ్రిమెంట్ బాండ్లు, నెలవారీ కంతుల కోసం రూ.68వేలు చెల్లించానని వివరించారు. కంపెనీ పేరిట మొత్తం 18 ఎకరాలను కొనుగోలు చేసి, తుడాలో లే అవుట్ అనుమతి తీసుకున్న తర్వాత ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయిస్తామని చెప్పారని పేర్కొన్నారు. ఇప్పుడు ఆ భూముల ధర కోట్లకు పెరగడంతో తమకు రిజిస్ట్రేషన్ చేయించకుండా బెదిరిస్తున్నారని వాపోయారు. మురళీకృష్ణ, మరో డైరెక్టర్ మల్లికార్జున తదితరులు బెదిరిస్తున్నారని, తనకు, తన కుటుంబానికి వారి నుంచి ప్రాణహాని ఉందని ఫిర్యాదు చేశారు. తనకు న్యాయం చేయాలని విన్నవించారు.


ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న బాధితుడు దేవాంజనేయులు

నిజాలు నిగ్గుతేలేనా..?

- శిశుమరణంపై అనుమానాలెన్నో...
- ఇప్పటికే త్రిసభ్య సంఘం నివేదిక
- ఐసీడీఎస్ డైరెక్టర్ విచారణ
- ఐదు గంటల పాటు ప్రశ్నల వర్షం
- సుమోటోగా కేసు నమోదు

5

ఎన్నెన్ని విన్నపాలో..!

- ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు రకరకాల సమస్యలు
- వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు: జేసీ



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతులమీదుగా స్వచ్ఛాంధ్ర అవార్డు అందుకుంటున్న కియ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఫెసిలిటీ, కన్‌స్ట్రక్షన్, సేఫ్టీ హెడ్ సాంగ్జీ కిం



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతులమీదుగా స్వచ్ఛాంధ్ర అవార్డు అందుకుంటున్న శ్రీసత్యసాయి జిల్లా కదిరి మండలం బూరుగుపల్లికి చెందిన గ్రీన్ అంబాసిడర్ ఎస్ దొడ్డప్ప

కోడిబాయె లచ్చమ్మదీ..!

- నాటు కోళ్లు మాయం చేస్తున్న ఆ ఇద్దరు
- క్వార్టర్ మందు.. రూ.200 ఇస్తే చాలు.. సరఫరా
- శింగనమలలో తరచూ బాధితులతో గొడవలు
- పోలీసులకు ఫిర్యాదు వెళ్లినా.. మందలింపుతో సరి

శింగనమల, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): నాటు కోడి కంటపడితే మాయం చేసేస్తున్నారు ఇద్దరు యువకులు. తెలిసినవాళ్లు ఫోన్ చేసి.. 'రేయ్ మామా.. కోడి..' అని అడిగిందే తడవు సరఫరా చేస్తున్నారు. వీరి దెబ్బకు ఇళ్ల వద్ద నాటు కోళ్లను పెంచుకునేవారు బెంబేలెత్తిపోతున్నారు. దొంగ కోళ్ల వ్యవహారం పోలీసుల వరకూ వెళ్లినా తేలిగ్గా తీసుకుంటున్నారు. 'కోడే కదా..' అని మందలింపుతో సరిపెడుతున్నారు. దీంతో ఆ ఇద్దరూ పేట్రేగిపోతున్నారని బాధితులు వాపోతున్నారు.



బస్టాండ్‌మే సవాల్..

సెప్టెంబరు 28వ తేదీ ఆదివారం..! పట్టణానికి చెందిన రామాంజనేయులు, చంద్రకళ దంపతుల నాటు కోళ్లు మాయమయ్యాయి. వారు వీధి కెక్కి తిట్ల దండకం ఎత్తుకున్నారు. ఆ దెబ్బకు మాయమైన కోళ్లు ఓ ఇంటి నుంచి కూత పెట్టుకుంటూ బయటకు పరిగెత్తుకు వచ్చాయి. ఆ ఇల్లు.. ఆ ఇద్దరు యువకుల బంధువులదట. దీంతో ఆర్టీసీ బస్టాండు వద్ద ఉన్న ఆ ఇద్దరు యువకులను రామాంజనేయులు నిలదీశాడు. పోలీసులకు ఫిర్యాదు చేస్తాని హెచ్చరించాడు. దీంతో గొడవ ముదిరి.. 'అవును.. మీ కోళ్లను మీమే తీసుకుపోయాం. ఇప్పుడు వదిలేశాం. మళ్లీ పట్టుకుపోతాం.. ఏం చేసుకుంటారు..?' అని ఆ యువకులు ఎదురు తిరిగారు. గొడవ ముదిరి పోలీస్ స్టేషన్ వరకూ వెళ్లింది. కోళ్లను దొంగతనం చేసింది కాక తమపై దాడి చేశారని దంపతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.



మందు బాటిల్ ఇస్తే చాలు..

దొంగ కోళ్ల వ్యవహారం శింగనమలతోపాటు గుత్తి మండలం, కర్నూలు జిల్లాకూ విస్తరించినట్లు సమాచారం. మార్కెట్‌లో 'పల్లె నాటు'కు డిమాండ్ కూడా భారీగా ఉంది. ఈ లెక్కన దొంగ కోళ్లను పట్టుకుని ఆ ఇద్దరు యువకులు బాగా సంపాదిస్తున్నారేమో అనుకుంటే కోడి కూరలో కాలేసినట్లే..! ఓ రూ.200 నగదు.. క్వార్టర్ బాటిల్ మందు ఇస్తే చాలు.. నాటు కోడిని ఇచ్చేస్తారట. నాటు కోడి తినాలని అనిపిస్తే చాలు 'రేయ్ తమ్ముడూ.. నోరు చెడిపోయింది..', 'రేయ్ మామా.. ఫ్రెండొచ్చాడు..' అని ఫోన్ కొడతారట. బంధువులు, ఫ్రెండ్స్ వచ్చినా, బర్త్ డే పార్టీ అయినా.. చివరకు మూడ్ బాగాలేకపోయినా 'కస్టమర్లు' వీరిని సంప్రదిస్తున్నారట. నాటు కోడి రుచి చూడాలని అనుకునేవారికి ఈ ఇద్దరూ బెస్ట్ సర్వీస్ చేస్తున్నారని ప్రచారం ఉంది. కనీసం రూ.1000 పెడితేగానీ దొరకని నాటుకోడిని వీరు రూ.200కే ఇచ్చేస్తున్నారని సమాచారం. కస్టమర్లు వీరిని లైన్‌లో పెట్టుకునేందుకు మందు బాటిల్‌ను కానుకగా ఇస్తున్నారని అంటున్నారు. అదీ.. ఓ సినిమా హీరో వాడే బ్రాండ్ అట..! ఈ ఇద్దరికి ఇద్దరు పోలీసులతో సత్సంబంధాలు ఉన్నాయనే ప్రచారం ఉంది.

రేయ్.. మా పేరు చెప్పకండ్రా..

పది రోజుల క్రితం బస్టాండు వద్ద జరిగిన దొంగ కోళ్ల గొడవ స్టేషన్ వరకూ వెళ్లడంతో ఆ ఇద్దరు యువకులను పోలీసులు పిలిపించారు. దీంతో తమ పేర్లు ఎక్కడ బయట పెడతారోనని దొంగ కోళ్లను వండుకుతిన్నవారు బెంబేలెత్తిపోయారు. ఏం జరుగుతుందో చూద్దామని కొందరు పోలీస్ స్టేషన్ వద్దకు వెళ్లి పరిణామాలను గమనించారు. మరికొందరు తెలిసినవారి చేత పోలీసులకు ఫోన్‌లు చేయించుకున్నారని సమాచారం. కేసు కట్టకపోయినా, ఆ రోజు నుంచి ఆ ఇద్దరు యువకులు స్టేషన్‌కు వచ్చిపోతున్నారు. దీంతో 'రేయ్.. మా పేరు చెప్పకండ్రా..' అని 'రుచి చూసినవారు' బతిమాలుతున్నారట.

కేసు నమోదు చేస్తాం..

నాటు కోళ్ల విషయంలో దాడి జరిగినట్లు ఫిర్యాదు వచ్చింది. పది రోజులుగా తిరుమల విధుల్లో ఉన్నాం. ఇన్‌చార్జి ఎస్ఐ ఉన్నందున కేసు నమోదు చేయలేదు. ఇద్దరు యువకులపై గతంలోనూ ఫిర్యాదులు ఉన్నాయని తెలిసింది. విచారించి కేసు నమోదు చేస్తాం.

- విజయ్‌కుమార్, ఎస్ఐ, శింగనమల

ఇది రైటేనా..?

పీఏబీఆర్ కుడికాలువపై నిర్లక్ష్యం

- పెరిగిన కంపచెట్లు .. దెబ్బతిన్న గట్లు
- నీరు వదిలితే ముందుకు సాగడం కష్టం
- ఆందోళనలో ఆయకట్టు రైతాంగం

కూడేరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): పీఏబీఆర్ (పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్) కుడి కాలువ పూర్తిగా దెబ్బతినడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ కాలువ పీఏబీఆర్ నుంచి ధర్మవరం చెరువు వరకు 113 కిలోమీటర్ల దూరం ఉంది. కంపచెట్లు పెరగడంతో కాలువ గట్టు దెబ్బతింది. అండర్ బ్రిడ్జిలకు రంధ్రాలు పడి, సైడ్ వాల్ కుంగిపోయింది. మరమ్మతులు చేయకపోవడంతో వచ్చిన నీరంతా వంకలపాలవుతోంది. పీఏబీఆర్ నీటిని దాదాపు 48 చెరువులకు తరలించేందుకు కుడికాలువను ఏర్పాటు చేశారు. అయితే దీని పర్యవేక్షణను గాలికొదిలేయడంతో కాలువ పూర్తిగా దెబ్బతింది. డ్యాం నుంచి 25వ కిలోమీటరు వరకు కాలువ పూర్తిగా దెబ్బతింది. డ్యాం నుంచి 15వ కిలోమీటరులోపు ఎక్కువ నీరు లీకై వంకల్లోకి వెళుతోంది. జల్లిపల్లి సమీపంలోని 4వ కిలోమీటర్ వద్ద గొరవయ్యదార్ల వద్ద అండర్ బ్రిడ్జికి భారీ రంధ్రాలు పడ్డాయి. దీనికి తోడు సైడ్ వాల్ పూర్తిగా కుంగిపోవడంతో భారీగా నీరు బయటకు వెళ్తున్నట్లు స్థానిక రైతులు చెబుతున్నారు. 6వ కిలోమీటరు వద్ద కూడా ఇదే పరిస్థితి నెలకొంది. కాలువ వెళ్లే దారిలో ఉన్న వంకల వద్ద నిర్మించిన అండర్ బ్రిడ్జిలు ఎక్కువగా అటవీ ప్రాంతంలో ఉండటంతో వాటి మరమ్మతులు సక్రమంగా చేయలేదు. కాలువకు నీరు వదిలిన సమయంలో ఇరిగేషన్ అధికారులు నానా హడావుడి చేస్తారు. నీరు బయటకు వెళ్లే ప్రదేశంలో ఇసుక బస్తాలు వేసి చేతులు దులుపుకుంటున్నారు. నీరు నిలిచిన తర్వాత అటు వైపు కన్నెత్తి చూడరు. దీంతో కాలువకు ఇరువైపులా కంప చెట్లు పెరిగిపోయాయి. కాలువ మధ్యలో పిచ్చి మొక్కలు, జనుము గడ్డి ఏపుగా పెరగడం, కాలువ సైడ్ వాల్ దెబ్బతిని రాళ్లు కాలువలో పడి నీటి ప్రవాహాన్ని నిరోధిస్తున్నాయి. దీంతో చెరువులకు నీరు చేరక రైతులు ఇబ్బంది పడుతున్నారు.



కుడికాలువ గట్లపై పెరిగిన కంపచెట్లు



4వ కిలోమీటరు వద్ద అండర్ బ్రిడ్జికి ఏర్పడ్డ రంధ్రం

రూ.కోటిన్నరతో ప్రతిపాదనలకు పంపితే...

డ్యాం నుంచి 25 కిలోమీటరు వరకు ఒక సబ్ డివిజన్, 26 నుంచి 113 కిలోమీటరు వరకు మరో సబ్ డివిజన్‌గా విభజించారు. దీంతో డ్యాం నుంచి 25 కిలోమీటరులోపు దెబ్బతిన్న కాలువ మరమ్మతులు చేయడానికి రూ.కోటిన్నరతో 13 పనులకు ప్రతిపాదనలు పంపితే రూ.8 లక్షలతో కంపచెట్లు తొలగించడం, లీకేజీల నివారణ పనులకు నిధులు కేటాయించారు. మిగిలిన పనులకు నిధులు మంజూరు కాకపోవడంతో తిరిగి ప్రతిపాదనలు పంపుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.

113 కిలోమీటరు వరకు రూ.రెండు కోట్లు మంజూరు..

పీఏబీఆర్ కుడికాలువ 26 కిలోమీటరు నుంచి 113 కిలోమీటరు వరకు దాదాపు రూ.2 కోట్లతో 23 పనులు మంజూరు అయ్యాయి. దీంతో కాలువ పనులు జరుగుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. కాలువకు నీరు వదిలితే అత్యధికంగా నీరు వృథాగా బయటకు వెళ్లే ప్రదేశం కూడేరు మండలంలోనే ఉంటుంది. ఉన్నతాధికారులు నీటి వృథాను అరికట్టేందుకు పనులు మంజూరు చేయకపోవడం గమనార్హం.



నాలుగున్నర కిలోమీటరు వద్ద దెబ్బతిన్న కాలువ గట్టుకు వేసిన ఇసుక బస్తాలు

నీటి వృథాని అరికట్టాలి



డ్యాం నుంచి జల్లిపల్లి గ్రామం వరకు నీరు పెద్ద ఎత్తున లీకై వృథాగా వంకలోకి వెళ్తుంది. అండర్ బ్రిడ్జిలకు పెద్ద పెద్ద రంధ్రాలు ఏర్పడి నీరు బయటకు వచ్చి వంకలోకి చేరుతోంది. అలాగే పొలాల్లోకి నీరు చేరుతుండటంతో పంటలు సాగు చేయడానికి అవకాశం లేకుండా పోతోంది. కాలువ దెబ్బతిన్న ప్రాంతంలో మరమ్మతులు చేసి నీటి వృథాను అరికట్టాలి.

- చంద్ర, రైతు, ఉదిరిపికొండ

త్వరగా నీరు విడుదల చేయాలి



పీఏబీఆర్ డ్యాం నుంచి కుడికాలువ ద్వారా చెరువులను పూర్తి స్థాయిలో నీటితో నింపాలి. వేసవి కాలంలో నీటి సమస్య తీవ్రంగా ఉంటుంది. ముందస్తుగా చెరువుల్లో నీటిని నింపితే మూగజీవాలతోపాటు ప్రజలకు దాహం తీరుతుంది. చెరువులో నీరు ఉండటం వల్ల భూగర్భ జాలలు పెరిగి, బోరుబావులు ఎండిపోకుండా ఉంటాయి. దీంతో అన్నదాతలు సాగు చేసిన పంటలకు నీటి గండం తప్పుతుంది. అధికారులు త్వరగా కుడికాలువకు నీరు విడుదల చేయాలి. -కృష్ణమూర్తి, జిల్లా ప్రధానకార్యదర్శి, వ్యవసాయ కార్మిక సంఘం

ఏరికోరి..!

- డిప్యూటీ ఎంపీడీఓ స్థానం కోసం తీవ్రపోటీ
- వారంలోపు పలువురికి ప్రమోషన్లు
- ఏరి కోరుకుంటున్న ఆశావహులు
- ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణ

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో డిప్యూటీ ఎంపీడీఓ స్థానం కోసం తీవ్ర పోటీ నెలకొంది. కోరుకున్న స్థానం దక్కించుకునేందుకు ఆశావహులు ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ఖాళీగా ఉన్న డిప్యూటీ ఎంపీడీఓ స్థానాలను భర్తీ చేయడానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇప్పటికే అర్హులైన వారి నుంచి ఏసీఆర్ (యానివల్ కాన్ఫిడెన్షియల్ రిపోర్ట్)లు కూడా సేకరించింది. వారం లోపే ప్రమోషన్ల ప్రక్రియ ముగించి ఉత్తర్వులు జారీ చేసే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. ప్రమోషన్ తథ్యమనుకున్న ఆశావహులు కోరుకున్న స్థానం దక్కించుకోవడం కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ప్రధానంగా అనంతపురం జిల్లా కేంద్రానికి కూత వేటు దూరంలో ఉండే రాప్తాడు డిప్యూటీ ఎంపీడీఓ స్థానానికి గట్టి పోటీ నెలకొన్నట్లు సమాచారం. ఇప్పటికే కొందరు అధికార పార్టీ ప్రజాప్రతినిధుల నుంచి గ్రీన్‌సిగ్నల్ తీసుకున్నట్లు తెలిసింది.

ఖాళీలు ఇలా..

ఉమ్మడి జిల్లాలో డిప్యూటీ ఎంపీడీఓ ఖాళీలు ఇలా ఉన్నాయి. తాడిపత్రి, బెళుగుప్ప, బ్రహ్మసముద్రం, రాప్తాడు, రామగిరి, రొద్దం, మడకశిర, రొళ్ల, అమరాపురం, పెనుకొండ, లేపాక్షి, చిలమత్తూరు, గోరంట్ల, కొత్తచెరువు, నల్లచెరువు, కదిరి, తలుపులకు ప్రస్తుతం ఇన్‌చార్జులుగా డిప్యూటీ ఎంపీడీఓలు ఉన్నారు. బ్రహ్మసముద్రంలో పని చేస్తున్న మాధవికి ఎంపీడీఓగా ఉద్యోగోన్నతి రావడంతో ఆ స్థానం ఖాళీ అయింది. పెనుకొండలో కమళాబాయి, నల్లచెరువులో శకుంతల, రాప్తాడులో ఆనంద్ ప్రసాద్‌కు కొన్ని రోజుల కిందట ఎంపీడీఓగా ప్రమోషన్ ఉత్తర్వులు రావడంతో డిప్యూటీ ఎంపీడీఓ సీట్లు ఖాళీ అయ్యాయి. ఇప్పుడు ఆ స్థానాలను కూడా ప్రమోషన్ పొందే వారితో భర్తీ చేయనున్నారు.

ప్రమోషన్ జాబితాలో కార్యదర్శులు ఇలా...

జిల్లాలో గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శులుగా పని చేస్తూ డిప్యూటీ ఎంపీడీఓ ప్రమోషన్ కోసం ఎదురుచూస్తున్న వారి జాబితాను ఇప్పటికే ప్రభుత్వానికి పంపారు. వారిలో చంద్రశేఖర్, సాదిక్‌వలి, సాదిక్, అశోక్ బాబు, గోపాల్, శ్రీనివాసరెడ్డి, ప్రేమ్‌కుమార్, ఎమ్ఎల్ఎన్ ప్రసాద్, ఎంవీ ప్రసాద్, సుధాకర్ కుమార్, భాస్కర్, అబ్దుల్ మునాఫ్, ఇబ్రహీం, ఎర్రిస్వామి, ఏవీ రమణ, బాబురావు ఉన్నారు. డీపీఓ కార్యాలయం ప్యానల్ నుంచి సీనియర్ అసిస్టెంట్లు మనోహర్, శివప్రసాద్ ఉన్నారు. జిల్లా పరిషత్ ప్యానల్ నుంచి సీనియర్ అసిస్టెంట్లు అచ్చితానంద బాబు, లెక్కలు శ్రీనివాసులు, రంగనాయకులు, హనుమంతు, మల్లికార్జున, రాజశేఖర్ ఉన్నారు. డిప్యూటీ ఎంపీడీఓ ప్రమోషన్లను కాదనుకుని ఏఓలుగా వెళ్లడానికి మల్లికార్జున, హనుమంతు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీంతో జిల్లా పరిషత్ ప్యానల్ నుంచి నలుగురు బరిలో ఉన్నారు. ఆయా వర్గాల నిష్పత్తులకు అనుగుణంగా వారంలోపు 10 మంది జాబితా విడుదల చేసి, మిగిలినవి త్వరలో విడుదల చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం.



డీపీఓ కార్యాలయం

ప్లేస్‌మెంట్ కోసం పోటీ

ప్రస్తుతం ప్రమోషన్లు పొందే ఉద్యోగుల్లో ప్లేస్‌మెంట్ కోసం తీవ్ర పోటీ నెలకొంది. ప్రధానంగా రాప్తాడుకు సంబంధించి ఐదుగురు పోటీ పడుతున్నట్లు సమాచారం. స్థానిక ఎంపీడీఓ మాత్రం జడ్పీ ప్యానల్ నుంచి వచ్చే సీనియర్ అసిస్టెంట్ అచ్చితానందబాబునే డిప్యూటీ ఎంపీడీఓగా ఖరారు చేయించేందుకు తీవ్ర ప్రయత్నం చేస్తున్నట్లు తెలిసింది. కార్యదర్శుల నుంచి అశోక్‌బాబు, గోపాల్, ప్రవీణ్‌కుమార్, ప్రేమ్‌కుమార్ లు కూడా ఎవరి ప్రయత్నం వారు చేస్తున్నట్లు సమాచారం. పెనుకొండ, గోరంట్ల, కొత్తచెరువు, కదిరి ప్రాంతాలకు కూడా డిమాండ్ ఉంది. ఎవరి పరిధిలో వారు స్థానిక ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలతో ఉన్నతాధికారుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. వారు కోరిన ప్లేస్‌మెంట్ దొరికితే లక్షల్లో ముడుపులు ముట్టచెప్పడానికి కూడా సిద్ధంగా ఉన్నట్లు సమాచారం.

ధర చెప్పకపోతే ఒప్పుకోం

- భూసేకరణపై రైతులు
- అధికారుల తీరుపై నిరసన



రోడ్డుపై బైఠాయించిన రైతులు

హిందూపురం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): 'పరిశ్రమలకు మేం వ్యతిరేకం కాదు. అయితే ఉన్నతాధికారులు రాకుండా వీఆర్‌ఓలతోనే భూసేకరణ చేస్తామంటే ఒప్పుకునే పరిస్థితి లేదు. ధర ఎంతో చెప్పకుండా పాసుపుస్తకాలు, అకౌంట్ పుస్తకాలు అడగడం ఏంటి' అని రైతులు ప్రశ్నిస్తున్నారు. హిందూపురం మండలం చలివెందుల, మలుగూరు రెవెన్యూ గ్రామాల పరిధిలో పరిశ్రమల ఏర్పాటు కోసం ప్రభుత్వం భూసేకరణకు శ్రీకారం చుట్టింది. అయితే ఇప్పటి వరకు అక్కడ గ్రామసభలు పెట్టినా ఉన్నతాధికారులు వెళ్లకుండా వీఆర్‌ఓలతోనే సరిపెట్టడంపై ఆయా గ్రామాల రైతులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. హిందూపురం మండలంలోని చలివెందుల, మలుగూరు రెవెన్యూ గ్రామాల పరిధిలో 12పల్లెలకు సంబంధించిన 8వేల ఎకరాల భూమిని సేకరించేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇక్కడ పరిశ్రమ ఏర్పాటు చేస్తామని ఇందుకోసం భూములు సేకరిస్తున్నట్లు అధికారులు సంబంధిత రైతులకు చెప్పారు. కానీ ఇప్పటి వరకు ధర చెప్పలేదు. అయితే నందమూరి నగర్ వద్ద సోమవారం గ్రామసభ పెట్టి భూమి పాసుపుస్తకాలు, ఆధార్, బ్యాంక్ ఖాతా పుస్తకాలు తీసుకురావాలని దండోరా వేయించడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో హిందూపురం-గోరంట్ల ప్రధానరహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూములు కోల్పోతున్న గ్రామాల పరిధిలో నాలుగు వరుసల జాతీయరహదారి నిర్మాణం చేపట్టారు. ఇందుకోసం ఎకరాకు రూ.29లక్షలు నష్టపరిహారం ఇచ్చారు. రైల్వే లైనుకు సేకరించిన భూమికి కూడా అదే ధర చెల్లించారు. ఇప్పుడు అదే తరహాలో పరిశ్రమల కోసం సేకరిస్తున్న భూములకు ధర ఇస్తామంటే అభ్యంతరం లేదన్నారు.

వాణిజ్య పంటలున్న భూములు వదిలేయాలి

: చిన్నారెడ్డి, మాజీ సర్పంచ్ చలివెందుల



పరిశ్రమలు పెడతామంటే మేం వ్యతిరేకించం. కానీ ఈగ్రామాల పరిధిలో దీర్ఘకాలిక వాణిజ్య పంటలు వక్క, మామిడితోపాటు మరికొన్ని పంటలున్నాయి. అలాంటి భూములు వదిలేసి న్యాయబద్ధమైన ధర చెల్లిస్తే భూములు ఇవ్వడానికి మేం సిద్ధంగా ఉన్నాం.

2013 భూసేకరణ చట్టం అమలు చేయాలి

: సిద్దారెడ్డి, రైతు సంఘం నాయకుడు, రాచపల్లి



2013భూసేకరణ చట్టం ప్రకారం రైతుల నుంచి సేకరించిన భూములకు నష్టపరిహారం చెల్లించాలి. మొదట కలెక్టర్, లేదా జాయింట్ కలెక్టర్ వచ్చి గ్రామసభలు ఏర్పాటుచేసి ధర ఎంత ఇస్తారో చెప్పాలి. ఏయే పరిశ్రమలు ఏర్పాటు చేస్తారో ప్రజలకు వివరించాలి. అలాకాకుండా కింది స్థాయి సిబ్బందిని పంపి భూములు లాక్కుంటామంటే ఒప్పుకోం.

ఉన్న భూమినైనా వదిలేయండి : శివలింగారెడ్డి, రైతు



గతంలో హంద్రీనీవా కాలువ కోసం నాకున్న ఆరు ఎకరాల భూమిలో నాలుగు ఎకరాలు తక్కువ ధరకే తీసుకున్నారు. ఉన్న రెండెకరాల్లో పంటలు సాగుచేసి జీవనం సాగిస్తున్నాం. ఇప్పుడు మళ్లీ పరిశ్రమల పేరుతో భూమి తీసుకుంటే మా పరిస్థితి ఏంటి. ఇప్పుడు ఉన్న భూమినైనా వదిలేయాలి.

నేటి నుంచి పెదయ్యస్వామి ఉత్సవాలు

- రెండురోజులపాటు నిర్వహణ
- 50వేల మంది హాజరవుతారని అంచనా

తాడిమర్రి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వెలసిన ఆర్వేడుపట్నం పెదయ్యస్వామి జలధిపూజ, పెద్దమ్మ, యల్లమ్మ సాగు ఉత్సవాలను మంగళవారం నుంచి రెండు రోజులపాటు తాడిమర్రిలో నిర్వహించనున్నారు. కురుబ కులస్థులైన ఆర్వేటివారు ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. మంగళవారం సాయంత్రం 3గంటలకు పుట్టకు పూజ చేయడంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. రాత్రి 11గంటలకు అమ్మవారి గంగపూజ, ఘటం ఊరేగింపు జరుగుతాయి. వివిధ గ్రామాల నుంచి హాజరయ్యే 25 రకాలగుడికట్ల స్వాములు మంగళవారం సాయంత్రం 5గంటలకే ఉత్సవ ప్రాంగణానికి చేరుకుంటాయని కార్యక్రమ నిర్వాహకులు తెలిపారు. 8వ తేదీ తెల్లవారుజామున 4గంటల నుంచి 6గంటల వరకు ఆర్వేడు పట్నం పెదయ్యస్వామికి పుణ్యాహవచనం, గంగపూజ,రుద్రాభిషేకం, బిందెపూజ, మహామంగళహారతి, బలిహారం జరుపుతామన్నారు. ఈ ఉత్సవాలకు దాదాపు 50వేల మంది హాజరవుతారని అంచనా వేస్తున్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన డీఎస్పీ

ఆర్వేడుపట్నం పెదయ్యస్వామి ఉత్సవాల ఏర్పాట్లను ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్ స్థానిక ఎస్ఐ క్రిష్ణవేణితో కలిసి పరిశీలించారు. సభాప్రాంగణం, స్వాములు భేటీ అయ్యే ప్రాంతం, పార్కింగ్‌స్థలం, అన్నదాన ఏర్పాట్లను పరిశీలించి స్థానిక సిబ్బందికి సూచనలు చేశారు. దాదాపు 150 మందితో బందోబస్తు నిర్వహించనున్నట్లు తెలిపారు. ట్రాఫిక్‌ను కూడా మళ్లించనున్నట్లు డీఎస్పీ తెలిపారు. పులివెందుల నుంచి ధర్మవరం వైపునకు వెళ్లే వాహనాలు చిల్లకొండయ్యపల్లిక్రాస్ నుంచి కునుకుంట్ల, మద్దెల చెరువు, తాడిమర్రి సబ్‌స్టేషన్ మీదుగా వెళ్లాలని ఎస్ఐ తెలిపారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ హేమంత్ కుమార్

ఆగని ఆక్రమణలు

- యథేచ్ఛగా కోడూరు మన్రో తోపులో కబ్జాలు
- ఎక్స్‌కవేటర్‌తో స్థలాల చదును
- అధికారుల హెచ్చరికలు బేఖాతరు
- బరితెగించిన కబ్జారాయుళ్లు

చిలమత్తూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోడూరు మన్రో తోపులో ఆక్రమణలు ఆగడం లేదు. ఇటీవల 44వ జాతీయ రహదారితో పాటు 342 జాతీయ రహదారులు విస్తరణ జరుగుతుండటంతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణాలను అధికారులు తొలగించారు. అయితే ఆ దుకాణా దారులు పంచాయతీకి సంబంధించిన మన్రో తోపు భూమిలో ఆక్రమణలకు తెరలేపారు. గతంలో ఇదే మన్రో తోపులో స్థలాలను ఆక్రమించి, భవంతులు నిర్మించి వ్యాపారాలను చేసుకుంటూ వచ్చారు. ఇప్పుడు రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణాలు తొలగించడంతో కొందరు మన్రో తోపులోని స్థలాలను కబ్జా చేయడానికి యత్నిస్తున్నారు. మన్రో తోపులో స్థలాల కబ్జా విషయంపై ఆంధ్రజ్యోతి పత్రికలో కథనాలు ప్రచురితమయ్యాయి. దానికి పంచాయతీ ఉన్నతాధికారులు స్పందించి కబ్జా చేసిన స్థలాలను పరిశీలించారు. కబ్జా చేసిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అయితే అధికారులు అలా వెళ్లారో లేదో అదే కబ్జారాయుళ్లు కోదండ రామాలయం సమీపంలో స్థలాలను యంత్రాల ద్వారా చదును చేయించారు. పంచాయతీ అధికారుల హెచ్చరికలను బేఖాతరు చేశారు. వారం రోజుల కిందట కూడా కొందరు కబ్జాలకు పాల్పడటంతో పంచాయతీ కార్యదర్శి భాస్కర్ స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అయితే పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో కబ్జారాయుళ్లు యథేచ్ఛగా సోమవారం ఎక్స్‌కవేటర్ల ద్వారా స్థలాలను చదును చేసుకున్నారు. దీనిపై స్థానిక ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోదండ రామాలయ ప్రాంగణమంతా కబ్జా చేస్తే భవిష్యత్తులో ఆలయ ఉత్సవాలను ఎలా జరుపుకోవాలని ప్రశ్నిస్తున్నారు. సెంటు భూమి ధర లక్షల్లో ఉంటున్న ఈ ప్రదేశంలో కబ్జాలు జరగడం విమర్శలకు తావిస్తోంది. కలెక్టర్ కోడూరు మన్రో తోపులో జరుగుతున్న ఆక్రమణలపై దృష్టి పెట్టి, అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.



స్థలాలను చదును చేస్తున్న యంత్రాలు

కౌన్సెలింగ్ ఇచ్చాం: మునీర్ అహమ్మద్, ఎస్ఐ

వారం రోజుల కిందట మన్రో తోపులో జరిగిన ఆక్రమణలపై పంచాయతీ కార్యదర్శి భాస్కర్ ఫిర్యాదు చేశారు. ఆక్రమణలకు పాల్పడిన వారిని స్టేషన్‌కి పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చాం. అయితే సోమవారం జరిగిన ఆక్రమణలకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

నిజాలు నిగ్గుతేలేనా..?

శిశుమరణంపై అనుమానాలెన్నో...

ఇప్పటికే త్రిసభ్య సంఘం నివేదిక

- ఐసీడీఎస్ డైరెక్టర్ విచారణ
- ఐదు గంటల పాటు ప్రశ్నల వర్షం
- సుమోటోగా కేసు నమోదు

అనంతపురం వైద్యం/క్రైం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): నవజాత శిశువు మృతికి కారణాలపై నిజాలు నిగ్గుతేలేనా..? అన్న ప్రశ్న సర్వత్రా నెలకొంది. శిశుకేంద్రం సిబ్బందిలో నిబద్ధత కొరవడటం, పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడం ప్రధాన కారణాలు అన్న చర్చలు వినిపిస్తున్నాయి. చిన్నపిల్లల వైద్యుడు కూడా లేకపోవడం శోచనీయం. ఈ పరిస్థితుల నేపథ్యంలో గురువారం నవజాత శిశువు మృతిపై నెలకొన్న అనుమానాలు నివృత్తి అవుతాయా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. త్రిసభ్య సంఘం ఆదివారం శిశుగృహను సందర్శించి, సంబంధిత అధికారులు, సిబ్బందిని విచారించిన విషయం తెలిసిందే. రాష్ట్ర మాతా, శిశు సంక్షేమశాఖ డైరెక్టర్ వేణుగోపాల్ రెడ్డి సోమవారం శిశుకేంద్రానికి చేరుకుని సిబ్బంది, అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించారు. ఈ నేపథ్యంలో శిశువు మరణ సమాచారాన్ని బయటకు పంపిందెవరని తీవ్రస్థాయిలో డైరెక్టర్ ప్రశ్నించినట్లు సమాచారం. ఈ పరిణామల క్రమంలో జిల్లా న్యాయశాఖ సుమోటోగా కేసు నమోదు చేయడం, జిల్లా న్యాయసేవాసాధికార సంస్థ కార్యదర్శి రాజశేఖర్ శిశుగృహను తనిఖీ చేయడం తీవ్రచర్చకు దారితీసింది. శిశువు మృతిపై జిల్లా జడ్జి భీమారావు ఆదేశాలతో జిల్లా న్యాయసేవాసాధికార సంస్థ కార్యదర్శి రాజశేఖర్ సోమవారం శిశుగృహకు వెళ్లి అక్కడి మేనేజర్, అధికారులు, సిబ్బందితో శిశువుమృతిపై వివరాలను ఆరాతీశారు. శిశువును కేంద్రానికి తీసుకొచ్చినప్పటి నుంచి జరిగిన పరిణామాలపై లోతుగా విచారించారు.

మూల్యం తప్పదా...?

నిరాదరణకు గురైన అనాథ శిశువులను సంరక్షించేందుకు శిశుగృహ కేంద్రాన్ని ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసింది. కొన్నేళ్ల క్రితం వరకు పదుల సంఖ్యలో శిశువులను అక్కున చేర్చుకుని సంరక్షించేవారు. ఆరేళ్ల వయసు వచ్చేవరకు సంరక్షించి, ఆ తరువాత పిల్లలులేని దంపతులకు దత్తత ఇస్తారు. దత్తత ప్రక్రియ మొత్తం ఆన్‌లైన్ ద్వారానే నడుస్తోంది.



మాతా, శిశు సంక్షేమశాఖ అధికారులను ప్రశ్నిస్తున్న డైరెక్టర్

ప్రస్తుతం శిశుగృహలో నలుగురు శిశువులు మాత్రమే ఉన్నారు. కళ్యాణదుర్గం ప్రాంతానికి చెందిన ఒక మహిళ పోషించలేక తన బిడ్డను ఆగస్టు 30న శిశుగృహకు అప్పగించింది. శిశువును చేర్చినప్పటి నుంచి ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందన్న సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. శిశువుల ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా చిన్నపిల్లల వైద్యుడిని ఏర్పాటుచేయాలి. ఇందులో భాగంగా ఒక ప్రైవేటు డాక్టర్‌ను నెలకు రూ.6వేల పారితోషికం ఒప్పందంతో నియమించారు. సదరు డాక్టర్ సమాచారం లేకుండానే శిశుగృహకు రావడం మానేశారు. శిశువుల ఆలనాపాలన చూసుకునేందుకు ఆరుగురు ఆయాలను నియమించారు. వీరిలో ఒక ఆయా ఉద్యోగ విరమణ పొందగా.. మరొకరు రిజైన్ చేసి వెళ్లిపోయారు. మిగిలిన నలుగురు శిశువుల ఆలనాపాలన చూసుకుంటున్నారు. ముగ్గురు ఆయాలకు పగలు, ఒకరికి రాత్రి విధులు కేటాయించారు. అర్ధరాత్రి శిశువులకు అనారోగ్య పరిస్థితులు తలెత్తితే ఒక ఆయా చూసుకోలేని పరిస్థితులున్నట్లు సమచారం. ఉన్న ఒక నర్సు నిత్యం శిశువుల ఆరోగ్య సంరక్షణ చూసుకోవాల్సి వస్తోంది.

దిద్దుబాటు చర్యలు తీసుకునేరా..?

పలు కారణాలతో శిశుగృహలో ఓ మగ శిశువు ప్రాణం బలైంది. కేంద్రం నిర్వహణ అస్తవ్యస్తంగా మారడంతో అక్కడి శిశువుల సంరక్షణలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్న విమర్శలున్నాయి. ప్రస్తుతం శిశుగృహలో సంరక్షణలోని శిశువులకు మెరుగైన సేవలందించేందుకు తక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. శిశుగృహ నిర్వహణ గాడిలో పెట్టడంతోపాటు అక్కడి అధికారులు, సిబ్బంది మధ్య ఎలాంటి విభేదాల్లేకుంటా కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. డాక్టర్‌ను నియమించడంతోపాటు తరచూ శిశువులకు వైద్యపరీక్షలు నిర్వహించాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా సంబంధిత ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

ప్రశ్నల వర్షం

శిశుగృహలో నవజాత శిశు మరణంపై మహిళా, శిశు సంక్షేమశాఖ రాష్ట్ర డైరెక్టర్ వేణుగోపాల్ రెడ్డి విచారణ చేపట్టారు. జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ, ఐసీడీఎస్ పీడీ నాగమణి, డీసీఎం టీఎస్ శ్రీదేవి ఆధ్వర్యంలో డైరెక్టర్ వేణుగోపాల్ రెడ్డి.. శిశుగృహ సిబ్బందిపై ప్రశ్నల వర్షం కురిపించారు. దాదాపు 5 గంటలపాటు ఏకబిగిన కొనసాగిన విచారణలో వెల్లడైన అంశాలను నివేదిక రూపంలో విజయవాడకు తీసుకెళ్లారు. విచారణపై వేణుగోపాల్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. నవజాత శిశువు మరణించిన విషయంపై క్షేత్రస్థాయిలో విచారణ చేపటటాట్టామన్నారు. శిశుగృహ సిబ్బంది పనితీరు, శిశువుల సంరక్షణ తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో విచారించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందులో భాగంగా శిశుగృహ సిబ్బందిని ఒక్కొక్కరిగా విచారణ చేశామన్నారు.

సిబ్బందిలో గుబులు

నవజాత శిశువు మరణాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు. మాతా, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి తీవ్రంగా పరిగణించారు. శిశు మరణానికి కారణాలపై డైరెక్టర్ వేణుగోపాల్‌ను క్షేత్రస్థాయి విచారణకు పంపడం, బృందంగా కాకుండా ఒక్కొక్కరిని వేరుగా విచారించడం, అక్కడికక్కడే వివరాలను నమోదు చేసుకోవడంతో కేంద్రం సిబ్బందిలో గుబులు రేగుతోంది. ఎవరు ఏమి చెప్పారో?, తనపై ఏవైనా పిర్యాదులు చేశారా? ఇలా అనేక ప్రశ్నలు సిబ్బందిని వెంటాడుతున్నాయి. ఎవరిపై వేట పడుతుందోనని ఆందోళనలో ఉన్నట్లు సమాచారం.

క్రైం కార్నర్

బంగారం షాపు యజమానికి టోకరా

- నకిలీ బంగారం అంటగట్టిన దంపతులు

ఉరవకొండ, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఓ జ్యువెలరీ షాపు యజమానికి ఓ మహిళ నకిలీ బంగారాన్ని అంటగంటి రూ.1.3లక్షల కాజేసిన సంఘటన సోమవారం జరిగింది. బళ్లారి రోడ్డులోని సీఎస్ఐ చర్చి సమీపంలో ఉన్న జ్యువెలరీ షాపునకు భార్య, భర్త వచ్చారు. తమ కుమార్తె పెళ్లి ఉందని, పాత బంగారాన్ని తీసుకుని కొత్త బంగారు కమ్మలు ఇవ్వాలని అడిగారు. తొలుత తన వద్ద ఉన్న బంగారు గొలుసును మహిళ షాపు యజమానికి ఇచ్చారు. దాన్ని పరీక్షించిన అతడు ఆరు గ్రాముల కమ్మలతోపాటు, రూ.40వేల నగదు ఇస్తానని చెప్పారు. అయితే కూతురు పెళ్లి పెట్టుకున్నామని, కాస్తా ఎక్కువగా ఇవ్వాలని అడిగి, బంగారు షాపు యజమానికి ఇచ్చిన గొలుసును తీసుకున్నారు. షాపు యజమాని ఏమరుపాటుగా ఉండటం గమనించి క్షణాల్లోనే తన వెంట తెచ్చుకున్న, అచ్చం అలాగే ఉన్న నకిలీ గొలుసును బయటకు తీసి అతడికి ఇచ్చారు. అతడు దీనిని గమనించకుండానే నగదు, బంగారు కమ్మలు ఇచ్చాడు. దీంతో దంపతులు అక్కడి నుంచి ఉడాయించారు. కొద్దిసేపటి తర్వాత దుకాణం యజమాని గొలుసును పరీక్షించగా, అది నకిలీ బంగారం అని గుర్తించి, మోసపోయినట్లు ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ విషయంపై పోలీసులను వివరణ కోరగా తమ దృష్టికి ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు.

బాలిక కిడ్నాప్.. వ్యక్తిపై పోక్సో కేసు

యాడికి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): పాఠశాలకు వెళుతున్న బాలికను కిడ్నాప్ చేసిన బత్తుల కృష్ణారెడ్డిని సోమవారం అరెస్ట్ చేసినట్లు సీఐ ఈరన్న తెలిపారు. ఆయన తెలిపిన మేరకు ఈ నెల 3న 9వ తరగతి చదువుతున్న బాలిక పాఠశాలకు వెళుతుండగా కుందనకోట గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి కిడ్నాప్ చేశాడు. బాలికను కసాపురం తీసుకువెళ్లి వివాహం చేసుకున్నాడు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కృష్ణారెడ్డిపై పోక్సో కేసు, కిడ్నాప్ కేసు, మైనర్‌ను వివాహం చేసుకున్న కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కేసు దర్యాప్తులో భాగంగా సోమవారం వేములపాడు క్రాస్‌వద్ద ఉన్న కృష్ణారెడ్డిని అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు.

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి ఆత్మహత్య

అనంతపురం న్యూటౌన్, గుత్తి, ధర్మవరం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని వేర్వేరు ప్రాంతాలలో ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. కేంద్రంలోని స్థానిక తాటిచెర్ల-అనంతపురం రైల్వేస్టేషన్ల మధ్యలోని నేషనల్ హైవే బ్రిడ్జి వద్ద సోమవారం ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడని రైల్వే ఎస్ఐ వెంకటేసులు తెలిపారు. మృతుడు అనంతపురం రూరల్ మండలంలోని నారాయణపురానికి చెందిన మల్లెల పోతన్న కుమారుడు మల్లెల రవికుమార్ (43)గా గుర్తించినట్లు పేర్కొన్నారు. గూడ్స్ రైలుకు ఎదురుగా వెళ్లాడని, కిందపడి బలమైన గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉందన్నారు. కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

గుర్తు తెలియని వ్యక్తి..



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

గుత్తి రైల్వే జీఆర్పీ పరిధిలోని తురకపల్లి రైల్వే స్టేషన్ సమీపాన గుర్తుతెలియని వ్యక్తి(40) రైలు కింద పడి మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. రైలు నుంచి కిందపడ్డాడా, రైలు కింద పడి చనిపోయాడా అన్నది తెలియాల్సి ఉందన్నారు. మృతుడు చామన చాయ వైట్ షర్ట్ ధరించి ఉన్నాడన్నారు. మృతదేహాన్ని గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేపట్టారు.

పెళ్లి కాలేదని..



మహేశ్ (ఫైల్)

వివాహం కాలేదన్న మనస్తాపంతో స్థానిక లోనికోటకు చెందిన మహేశ్ (37) సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. లోనికోటకు చెందిన రామకృష్ణ కుమారుడు మహేశ్ ఎల్‌సీ కేపురంలోని ఇనుప సామాన్ల దుకాణంలో పనిచేస్తూ కుటుంబానికి చేదోడువాదోడుగా ఉండేవాడు.అతడికి ఎన్ని సంబంధాలు చూసినా పెళ్లి కుదరలేదు. దీంతో మనస్తాపం చెందిన అతడు ఇంట్లోనే ఉరేసుకుని, ఆత్మహత్య చేసుకున్నాడు. మహేశ్ పనికి రాకపోవడంతో దుకాణ యజమాని ఫోన్ చేయగా.. స్విచాఫ్ వచ్చింది. దీంతో అతడి తల్లి సుబ్బమ్మకు సమాచారం ఇచ్చాడు. ఆమె ఇంటి వద్దకు వచ్చి చూసేసరికి మహేశ్ ఉరికి వేలాడుతూ కనిపించాడు. ఆమె బోరున విలపించింది. సుబ్బమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు.

చీనీ టన్ను రూ.15 వేలు

అనంతపురం రూరల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం సీజనల్ చీనీ కాయలు టన్ను గరిష్ఠంగా రూ.15వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఇన్‌చార్జి కార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.8వేలు, సరాసరిగా రూ.12 వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 54టన్నుల చీనీ కాయలు వచ్చినట్లు చెప్పారు.

టమోటా కిలో రూ.22

అనంతపురం రూరల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో సోమవారం టమోటాలు కిలో గరిష్ఠంగా రూ.22తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అదే విధంగా కనిష్ఠంగా రూ.12వేలు, సరాసరిగా రూ.16తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 1,425 టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

కొనసాగిన బ్యాడ్మింటన్ పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు రెండో రోజు సోమవారం కొనసాగాయి. స్థానిక నాయక్‌నగర్‌లో మూడు రోజులపాటు సాగే రాష్ట్రస్థాయి అండర్-17 షటిల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలలో భాగంగా లీగ్, క్వార్టర్ ఫైనల్ పోటీలు నిర్వహించారు. చివరి రోజు మంగళవారం క్వార్టర్‌ఫైనల్‌లో గెలుపొందిన వారికి కేటగిరీల వారిగా సెమీస్, ఫైనల్స్ జరుగుతాయని జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బుగ్గయ్య చౌదరి, జయకుమార్ తెలిపారు.

స్వదేశీ వస్తువులకు మోదీ ప్రోత్సాహం

- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుకర్

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆనాడు మహాత్మాగాంధీ, ప్రస్తుతం ప్రధాని నరేంద్రమోదీ స్వదేశీ వస్తువులను ప్రోత్సహించారని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుకర్ పేర్కొన్నారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్ అధ్యక్షతన సోమవారం ఆత్మనిర్భర్ భారత్ (సంకల్ప అభియాన్) సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మధుకర్ మాట్లాడుతూ స్వదేశీ వస్తువులు దేశంలో ప్రతి ఒక్కరూ నిత్యజీవితంలో వినియోగించాలని, మన దేశంలో వస్తువుల తయారీని ప్రోత్సాహించాలని కోరారు. స్వదేశీ వస్తువులు తయారు చేసే చిన్నచిన్న పరిశ్రమల స్థాపనకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. డిసెంబరు 25 వరకు గ్రామ స్థాయిలో స్వదేశీ వస్తువులపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుడిసె దేవానంద్, కార్యదర్శి సందిరెడ్డి శ్రీనివాసులు, రాష్ట్ర సేల్స్ కన్వీనర్ చిరంజీవిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు అశోక్ రెడ్డి, ఆంజనేయులు, శ్రీదేవి, ఆత్మనిర్భర్ భారత్ జిల్లా కమిటీ సభ్యులు సత్యానారాయణ రెడ్డి, దేవరాజు, కవితాశర్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుకర్

దళితుడైనందుకే దాడి యత్నం

- సీజేఐపై దాడిని ఖండించిన ప్రజాసంఘాలు

అనంతపురం టౌన్, అక్టోబరు6 (ఆంధ్రజ్యోతి): దళితుడనే కారణంతోనే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై మతోన్మాదులు దాడికి యత్నించారని ప్రజాసంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దాడిని ఖండిస్తూ ఐలు, సీఐటీయూ, ఐద్వా, ఎస్ఎఫ్ఐ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని క్లాక్‌టవర్ కూడలి వద్ద కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు నాగేంద్రకుమార్, సతీష్, ప్రసన్నకుమార్, చంద్రిక, పరమేష్ తదితరులు దాడిని ఖండిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సనాతన ధర్మానికి అవమానం జరిగిందనే పేరుతో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై అడ్వకేట్ రాకేష్ కుమార్ కోర్టులో అందరూ చూస్తుండగానే చెప్పు విసరడం దేశంలో నెలకొన్న దుస్థితికి అద్దం పడుతోందన్నారు. దేశ అత్యున్నత స్థాయి పదవుల్లో ఉన్న దళితులకే ఈ గతి పడుతుంటే సామాన్యుల పరిస్థితేంటని ప్రశ్నించారు. అనంతరం సీజేఐపై దాడికి యత్నించిన దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ నగర వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ, ఐలు, ఐద్వా, ఎస్ఎఫ్ఐ నాయకులు వీరు యాదవ్, ప్రకాష్, హుస్సేన్, నాగమణి, గోపాల్, రామాంజనేయులు, చంద్రిక, శ్యామల, అశ్విని, గిరి, భీమేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



టవర్‌క్లాక్ కూడలి వద్ద కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న ఐలు, సీఐటీయూ, ఐద్వా, ఎస్ఎఫ్ఐ నాయకులు

దరఖాస్తు చేసుకోండి

పుట్టపర్తిరూరల్, అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): ధర్మవరం, హిందూపురం బాలసదనాలు, శిశుగృహాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ పీడీ ప్రమీల సోమవారం ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్ ఎదురుగా ఉన్న ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తులు పొందవచ్చన్నారు. అలాగే https//srisathya-sai.ap.gov.in వెబ్‌సైట్ నుంచి కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 9 నుంచి 25వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తులు సమర్పించవచ్చన్నారు. దరఖాస్తులను ఐసీడీఎస్ కార్యాలయంలో అందజేసి, రసీదు పొందాలని పీడీ వివరించారు.

చెస్‌లో జిల్లాకు పతకాల పంట



పతకాలు సాధించిన జిల్లావాసులు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): దక్షిణ భారత ఓపెన్ చెస్ పోటీల్లో జిల్లాకు పతకాల పంట పండింది. కర్ణాటకలోని బళ్లారిలో ఆదివారం నిర్వహించిన ఇండియా ఓపెన్ అండర్-16 చెస్ పోటీల్లో జిల్లాకు చెందిన ఉదయ్‌కుమార్ నాయుడు 6 పాయింట్లతో రన్నరప్ టైటిల్ సాధించాడు. ఓపెన్ విభాగంలో జొన్నలగడ్డ నితీష్ 5 పాయింట్లతో ట్రోఫీ కైవసం చేసుకున్నాడు. అండర్-16 విభాగంలో త్రిపద బంగారు పతకం, అండర్-8 విభాగంలో నిహాల్ ద్వితీయస్థానం, అన్విత్ 12వ స్థానంలో నిలిచారు. అండర్-14 విభాగంలో దర్శన్ నాలుగోస్థానం, అండర్-10లో జనని 8వ స్థానంలో నిలవగా, యంగెస్ట్ ప్లేయర్‌గా శ్రీనిక్ రక్షణ్ నిలిచాడు.

ఆర్డీటీ కోసం 10 నుంచి దీక్షలు: సీపీఐ

గుంతకల్లు టౌన్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆర్డీటీ సేవలను తక్షణమే పునరుద్ధరించాలనే డిమాండ్‌తో ఈనెల 10వ తేదీ నుంచి సామూహిక దీక్షలు చేపట్టనున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీష్ పేర్కొన్నారు. స్థానిక బీటీ ఫక్కీరప్ప భవనంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాకు ఆర్డీటీ అపన్నహస్తం అన్నారు. ఎన్నో సేవలందిస్తున్న ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏని పునరుద్ధరించకపోవడం సరికాదన్నారు. అన్ని పార్టీల ప్రజాప్రతినిధులు ఈ సమస్యను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం దక్కలేదన్నారు. ఇప్పటికే ఏడాది గడిచిందనీ, ఆర్డీటీ నిర్వహిస్తున్న హాస్పిటళ్లు మూతపడే పరిస్థితి దాపురించిందన్నారు. ఆర్డీటీ పరిరక్షణ కమిటీ పేరుతో అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా, కులసంఘాలను ఏకం చేసి, ఈనెల 10 నుంచి గుంతకల్లు మున్సిపల్ కార్యాలయం వద్ద సామూహిక దీక్షలు చేపడుతున్నట్లు తెలిపారు. 18న పెద్దఎత్తున ప్రజాప్రదర్శన నిర్వహించి, కేంద్ర హోంశాఖకు నిరసన తెలియజేస్తామన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు గోవిందు, పట్టణ కార్యదర్శి గోపీనాథ్, సహాయ కార్యదర్శి ఎస్ఎండీ గౌస్, మండల కార్యదర్శి రాము, కార్యవర్గసభ్యుడు దేవేంద్ర పాల్గొన్నారు.

వడ్డె ఓబన్న.. తొలి సమరయోధుడు

- వడ్డెర సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వెంకటేశులు



వడ్డె ఓబన్న చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

అనంతపురం క్రైం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): తెల్లదొరలను ఎదుర్కొన్న మొదటి స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న అని వడ్డెర సంఘం నాయకులు పేర్కొన్నారు. వడ్డె ఓబన్న 179వ వర్ధంతిని వడ్డెర సంఘం, జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు సోమవారం ఆ సంఘం కార్యాలయంలో నిర్వహించారు. ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వడ్డెర సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్డె వెంకటేశులు మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ వారిపై పోరాడి వీర మరణం పొందాడని అన్నారు. ఆయన త్యాగాలు మరువలేనివని కొనియాడారు. అనంతపురం నగరం నడిమి వంకలోని గంగమ్మ దేవాలయం వద్ద ఓబన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం ముఖ్య నాయాకులు మల్లెల జయరాం, దేవళ్ల మురళి, గోపాల్, వేణుగోపాల్, సుధాకర్, లక్ష్మన్న, గంగన్న, వెంకటరాముడు, మంజునాథ్, మారుతి, సూర్యప్రకాష్, మంజుల నారాయణ, వెంకటరాముడు, రమణ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా తైక్వాండో జట్టు ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ జిల్లాస్థాయి తైక్వాండో జట్టును సోమవారం ఎంపిక చేశారు. జిల్లాస్థాయి ఎంపిక పోటీలను స్థానిక అశోక్‌నగర్‌లోని డీఎస్‌ఏ ఇండోర్‌స్టేడియంలో నిర్వహించారు. ప్రతిభ చూపిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. ఆ వివరాలను స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు ప్రకటించారు. అండర్-14 బాలుర విభాగంలో మనోజ్ సాయి, భాగ్యరణ్, లోకేష్, గౌతమ్, స్మిత్‌బానా, గణేష్, రాహుల్‌కృష్ణ, మహ్మద్, ప్రశిత్ ఎంపికయ్యారు. అండర్-17 బాలుర జట్టులో కృష్ణ, బాలాజీ, శ్రీధర్, శ్రీకాంత్, ఎం మహేష్, ప్రసాద్, ఎస్ మహేష్, రాజేష్, వి లోకేశ్వరరావు, శ్రీనివాస్, సి లోకేశ్వరరావు, నవీన్, కిరణ్ చోటు దక్కించుకున్నారు. అండర్-17 బాలికల విభాగంలో భవాని, తరిణి, సాయినిషా, శ్రావణి, పుష్ప, సతీశ్వరి, సౌజన్య, ఏక్తా, నిష, యామిని, మంజుల ఎంపికయ్యారు. కార్యక్రమంలో రిటైర్డ్ డీఎస్‌డీఓ రమణ, జిల్లా తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శాంతరాజ్, పీడీలు ప్రభాకర్, శకుంతల, లక్ష్మీనారాయణ, సుహాసిని పాల్గొన్నారు.

ఎన్నెన్ని విన్నపాలో..!

- ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికకు రకరకాల సమస్యలు
- వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు: జేసీ



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జేసీ శివనారాయణ శర్మ

అనంతపురం కలెక్టరేట్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించరాదని జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో అధికారులతో కలిసి ఆయన 375అర్జీలను స్వీకరించారు. జేసీతో పాటు డీఆర్ఓ మలోల, డిప్యూటీ కలెక్టర్లు రామకృష్ణారెడ్డి, ఆనంద్, తిప్పేనాయక్, శ్రీనివాసులు, మల్లికార్జున, వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ... ప్రభుత్వం పీజీఆర్ఎస్ కార్యక్రమానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. అర్జీలను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మిగులు భూమి ఎక్కించండి...



సదాశివయ్య

మిగులు భూమిని తన పేరుతో ఎక్కించుకోవడానికి నానా తిప్పలు పడాల్సి వస్తోందని సదాశివయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. బొమ్మనహాళ్ మండలం బలనగొడ్డం గ్రామానికి చెందిన సదాశివయ్య కలెక్టరేట్‌లో అర్జీ అందజేశాడు. సర్వే నెంబరు 229లో 3.83 ఎకరాలలో 3.5ఎకరాలు తన పేరుతో ఆన్‌లైన్ ఉందని తెలిపాడు. మిగిలిన 33సెంట్లు ఆన్‌లైన్‌లో ఎక్కలేదన్నారు. అధికారులేమో మిగులు భూమి అని చెబుతున్నారన్నారు. ఆన్‌లైన్‌లో ఎక్కించే విషయంలో ఎన్నిసార్లు అడిగినా పట్టించుకోవడం లేదన్నాడు.

డెత్ సర్టిఫికెట్‌లో పేరు మార్చారు



రహంతుల్లా

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి పేరును ఆధార్‌కార్డులో ఉన్న పేరు కాకుండా డెత్ సర్టిఫికెట్‌లో మరోపేరు నమోదు చేశారని పామిడికి చెందిన రహంతుల్లా వాపోయాడు. ఈమేరకు పీజీఆర్ఎస్‌లో అధికారులకు అర్జీ అందజేశాడు. తన బావమరిది షేక్ బాబా ఫక్రుద్దీన్ గత నెల 25న రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడని రహంతుల్లా తెలిపాడు. ప్రభుత్వాసుపత్రిలో డెత్ సర్టిఫికెట్‌లో సిబ్బంది పేరు మార్చారన్నారు. ఆధార్‌లో షేక్ బాబా ఫక్రుద్దీన్ ఉండగా డెత్‌సర్టిఫికెట్‌లో బాబావలి అని నమోదు చేశారన్నాడు. చివరికి నోటరీ తీసుకొచ్చినా మార్చలేదన్నారు. అక్కడి సిబ్బంది ఎవరికైనా చెప్పుకోమని ధిక్కరిస్తున్నాడని వాపోయాడు. న్యాయం చేయాలని కోరాడు.

నాలుగేళ్లుగా తిరుగుతున్నా..

తన పేరుతో ఆన్‌లైన్ భూమి ఎక్కించుకోవడానికి నాలుగేళ్లుగా తిరుగుతున్నా ఫలితం లేదని ఓ వృద్ధ రైతు ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కారవేదికలో యల్లనూరుకు చెందిన వృద్ధ రైతు రామచంద్రారెడ్డి అధికారులకు వినతిపత్రం అందజేశాడు. యల్లనూరు పరిధిలోని సర్వే నెంబరు 1644సీలో 2.86ఎకరాల భూమి ఉందన్నారు. కొన్నేళ్ల కిందట ఈ భూమిని మరొకరు తమ పేరుతో ఆన్‌లైన్‌లో ఎక్కించుకున్నారని తెలిపాడు. తరచూ ఫిర్యాదులు చేయడంతో వారి పేరు తొలగించారన్నాడు. కానీ ఆ భూమి తన పేరుతో ఎక్కించుకోవడానికి తహసీల్దార్, ఆర్డీఓ కార్యాలయం చుట్టూ తిరిగినా న్యాయం జరగలేదని వాపోయాడు. నాలుగేళ్లుగా తిరిగి అలసిపోయానని, ప్రమాదంలో కాలు విరిగిందని ఆవేదన వ్యక్తం చేశాడు. కలెక్టరేట్‌లోనూ నాలుగుసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని, ఇప్పటికైనా న్యాయం చేయాలని కోరాడు.



రామచంద్రారెడ్డి

సీఎం, డీసీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం



చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న టీడీపీ నాయకులు, ఆటో డ్రైవర్లు

చెన్నేకొత్తపల్లి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఆటో డ్రైవర్ల సేవలో.. అనే పథకాన్ని ప్రారంభించడం పట్ల మండలకేంద్రం లోని ఆటోడ్రైవర్లు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్థానిక టీడీపీ నాయకులతో కలిసి సోమవారం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఎమ్మెల్యే పరిటాల సునీత చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దండు ఓబులేశు, నాయకులు అంకే అమరేంద్ర, వడ్డే దుర్గా, చెన్నకేశవుల గౌడ్, మార్కెట్‌యార్డు డైరెక్టర్ లక్ష్మీనరసమ్మ, బీజేపీ నాయకుడు జిలకర ఆంజనేయులు పాల్గొన్నారు.

ఘనంగా గౌరమ్మ పండుగ

రాప్తాడు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని బండమీదపల్లి, యర్రగుంట, పాలచెర్ల, బోగినేపల్లి తదితర గ్రామాల్లో సోమవారం గౌరమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏడాది దసరా పండుగ అనంతరం గౌరమ్మ పండుగను నిర్వహిస్తారు. ఈ క్రమంలో ఈ ఏడాది కూడా జరిపారు. స్థానిక ఆలయాల్లో గ్రామస్థులు ప్రతిష్ఠించిన గౌరమ్మ విగ్రహాలకు యువతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం సాయంత్రం ఆ విగ్రహాలను డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి స్థానిక చెరువులు, చెక్‌డ్యాంలలో నిమజ్జనం చేశారు. గ్రామ ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ సామగ్రి చోరీపై ఫిర్యాదు

రాప్తాడు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని బుక్కచెర్ల గ్రామంలో రైతు ఎద్దుల నల్లపరెడ్డికి చెందిన పొలంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు గుర్తుతెలియని దుండగులు విద్యుత్ కనెక్షన్ కట్ చేసి అందులోని ఆయిల్, కాపర్‌ను చోరీ చేశారు. ఈ ఘటన గత సెప్టెంబరు 29వ తేదీ రాత్రి జరిగింది. దీంతో బాధిత రైతు ఆలస్యంగా రాప్తాడు పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు.

ఘనంగా వినాయకుడి విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న డీఎంహెచ్‌ఓ, వైద్య సిబ్బంది

రాప్తాడు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో సోమవారం వినాయకుడి విగ్రహాన్ని సోమవారం ఘనంగా ప్రతిష్ఠించారు. ఉదయం 6 నుంచి 11 గంటల వరకూ వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. తర్వాత డీఎంహెచ్‌ఓ ఈబీదేవి, డీఐఓ యుగంధర్, డీపీఎంఓ శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ విజయకుమారి, ఎంపీడీఓ విజయలక్ష్మి, వైద్యాధికారి శివకృష్ణ, సర్పంచ్ సాకే తిరుపాలు, టీడీపీ మండల కన్వీనర్ కొండప్ప, వైద్యసిబ్బంది ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు.

పేరూరులో వ్యక్తిపై దాడి

రామగిరి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరూరు గ్రామంలో ఓ వ్యక్తిపై మద్యం సేవించిన మరో వ్యక్తి దాడి చేసి గాయపరిచాడు. ఈ సంఘటన ఆదివారం రాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. పేరూరు గ్రామానికి బెస్త అశ్వర్థనారాయణ పశువులకు నీళ్ల తీసుకుని సైకిల్‌పై వస్తుండగా మసీదు సమీపంలో వడ్డి వెంకటరాముడు మద్యంమత్తులో రాయితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. స్పృహతప్పి పడిపోయిన అశ్వర్థనారాయణను స్థానికులు ఆస్పత్రికి తీరలిస్తుండగా.. మళ్లీ అతను దాడి చేయడానికి ప్రయత్నించాడు. స్థానికులు అడ్డుకుని బాధితున్ని వెంటనే ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తర్వాత బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలు సేకరించి కేసు నమోదు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

వృద్ధుడి అదృశ్యం



కాయల ఆదెప్ప

శింగనమల, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని సి.బండమీదపల్లి గ్రామానికి చెందిన వృద్ధుడు కాయల ఆదెప్ప అదృశ్యం అయినట్లు ఎస్‌ఐ విజయ్ కుమార్ తెలిపారు. 60 ఏళ్ల వయసు గల ఆదెప్ప గత నెల 19వ తేదీన ఇంటి వద్ద చిన్న పాటి గొడవ జరగడంతో ఇంటి నుంచి అలిగి వెళ్లిపోయాడు. తర్వాత ఇప్పటి వరకు తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు పలు చోట్ల గాలించినా ఆచూకీ తెలియలేదు. ఎవరికైనా అతడి ఆచూకీ తెలిస్తే 9346010580కు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ కోరారు.

ఈ-క్రాప్ నమోదు గడువు పొడిగింపు

శింగనమల, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలకు ఈక్రాప్ నమోదు చేయించడానికి ఈనెల 25 వ తేదీవరకు గడువును పెంచినట్లు ఏఓ అన్వేష్‌కుమార్ సోమవారం ప్రకటనలో తెలిపారు. మండల వ్యాప్తంగా ఖరీఫ్‌లో పంటలు సాగు చేసిన రైతులు గడువు తీరేలోగా వ్యవసాయ అధికారుల చేత పంటలకు ఈ క్రాప్ నమోదు చేయించాలని సూచించారు.

నియామకం

చెన్నేకొత్తపల్లి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి):అఖిలభారత అయ్యప్ప భక్తుల సంఘం మండల శాఖ అధ్యక్షుడిగా చెన్నేకొత్తపల్లికి చెందిన బిల్లే వేణుగోపాల్‌ను నియమించినట్టు ఆ సంఘం జాతీయఅధ్యక్షుడు పెంచలయ్య సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ... అయ్యప్ప భక్తుల అభ్యుదయానికి, సమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషిచేస్తానన్నారు. తనను మండల అధ్యక్షుడిగా నియమించినందుకు జాతీయ అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏను పునరుద్ధరించాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

శింగనమల, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంత జిల్లాలో పేదలకు అనేక సేవలందించిన ఆర్డీటీకి వెంటనే కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సీఆర్‌ఏను పునరుద్ధరించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నప్పయాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శింగనమల తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ఆయన సీపీఐ నాయకులతో కలిసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్డీటీ.. పేదల పాలిట వరమన్నారు. ఆ సంస్థకు వెంటనే కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సీఆర్‌ఏను పునరుద్ధరించాలన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మధుయాదవ్, నేసేమధు, చంద్రశేఖర్, చికెన్ బాషా, రామసూబ్బారెడ్డి తదితరులు పాలొన్నారు.

నీటి పన్ను వసూళ్లలో నిర్లక్ష్యం వీడాలి

- నగర పాలక సంస్థ కమిషనర్ బాలస్వామి సూచన
- పీజీఆర్‌ఎస్‌లో ఆరు వినతుల స్వీకరణ



పీజీఆర్‌ఎస్‌లో వినతులు స్వీకరిస్తున్న ఏఎంసీ కమిషనర్ బాలస్వామి

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): నగరంలో పెండింగ్‌లో ఉన్న నీటి పన్ను వసూళ్లలో నిర్లక్ష్యం వీడాలని నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి అధికారులు, సిబ్బందికి సూచించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. ఇందులో ప్రజలు వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ కమిషనర్‌కు ఆరు వినతిపత్రాలు అందజేశారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు వినతిపత్రాల ద్వారా తెలిపిన సమస్యల్ని వెంటనే పరిష్కరించాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు. అలాగే ప్రజలు నీటి పన్ను చెల్లించి ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. ఐదారేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న నీటి పన్ను వసూళ్లపై రెవెన్యూ, ఇంజనీరింగ్, నీటి సరఫరా విభాగం అధికారులు నిర్లక్ష్యం వీడాలని, ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన వసూలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ ఎస్‌ఈ రాజశేఖర్, ఏసీపీ శిరీష, ఎంహెచ్‌ఓ నరసింహులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేని కలిసిన పాలకవర్గ సభ్యులు



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న మార్కెట్ యార్డు పాలకవర్గ సభ్యులు

బుక్కరాయసముద్రం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): శింగనమల మార్కెట్ యార్డు ఛైర్మన్ దండుశ్రీనివాసులు, వైస్ ఛైర్‌పర్సన్ ఎస్ శైలజతో పాటు పాలకవర్గ సభ్యులు ఎమ్మెల్యే బండారుశ్రావణిశ్రీని జిల్లాకేంద్రంలోని నివాసంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. అనంతరం ఛైర్మన్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో మార్కెట్ యార్డుకు ఇప్పటి వరకు 10 ఎకరాల స్థలం మాత్రమే కేటాయించారన్నారు. అందులో భవన నిర్మాణాలు, రైతులకు గోడౌన్‌లు, పశువుల షెడ్లు, ప్రహరీగోడలు, కార్యాలయ భవనాలు నిర్మించలేదని ఎమ్మెల్యేకు తెలిపారు. త్వరలోనే మార్కెట్ యార్డులో అభివృద్ధి పనులకు సంబంధించి నిధులు మంజూరు చేసేవిధంగా సీఎం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఎమ్మెల్యే స్పందిస్తూ తన హయాంలోనే మార్కెట్ యార్డు నిర్మాణ పనులు పూర్తి చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అందరి సహకారంతో రైతులకు సేలందించే విధంగా పాలక వర్గం పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నేత పసుపుల శ్రీరామిరెడ్డి, మార్కెట్ యార్డు డైరెక్టర్లు నారాయణస్వామి, ఈశ్వరయ్య, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన భవాని రవికుమార్



సీఎంతో భవాని రవికుమార్

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర రాష్ట్ర డైరెక్టర్ భవాని రవికుమార్ సీఎం చంద్రబాబును కలిశారు. స్వచ్ఛాంధ్ర రాష్ట్ర స్థాయి అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సోమవారం నిర్వహించారు. ఇందులో సీఎం ముఖ్యఅతిథిగా పాల్గొనగా.. భవాని రవికుమార్ కలిసి మాట్లాడారు. స్వచ్ఛాంధ్ర రాష్ట్ర డైరెక్టర్ పదవి తనకు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అందుకు తగ్గట్టుగానే తన వంతు చర్యలు చేపట్టి ఫలితాల సాధనకు కృషి చేస్తానని తెలిపారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలకు ప్రభుత్వం తరుపున మీరు ఇస్తున్న సహకారం మరువలేమని పేర్కొన్నారు.

రిటైర్డ్ పోలీస్ అధికారులకు ఎస్పీ సన్మానం



సన్మానం పొందిన రిటైర్డ్ అధికారులతో ఎస్పీ జగదీష్

అనంతపురం క్రైం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ చేసిన పలువురు పోలీస్ అధికారులను ఎస్పీ జగదీష్ సోమవారం సత్కరించారు. జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఎస్‌ఐ లోకనాథ్‌చౌదరి, ట్రాఫిక్ ఎస్‌ఐ విజయభాస్కర్ రాజు, అనంతపురం రూరల్ మహిళా ఏఎస్‌ఐ వరలక్ష్మి ఉద్యోగ విరమణ పొందారు. దీంతో వారిని స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్పీ పూలమాలలు వేసి, శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. తర్వాత మాట్లాడుతూ... పోలీస్‌శాఖలో వీరు చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వర్‌రెడ్డి, ఆర్‌ఐ మధు, ఏఓ రవిరామ్‌నాయక్, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, గాండ్ల హరినాథ్, లక్ష్మీనారాయణ, సరోజ తదితరులు పాల్గొన్నారు.

మృతిచెందిన హోంగార్డుల కుటుంబాలకు ఆర్థిక సాయం..

ఇటీవల మృతి చెందిన ముగ్గురు హోంగార్డుల కుటుంబీకులకు, ఉద్యోగ విరమణ చేసిన ఇద్దరు హోంగార్డులకు ఎస్పీ ఆర్థిక సాయం అందించారు. ఈ ఏడాది జూన్ 5న లక్ష్మిరెడ్డి అనారోగ్యంతో మరణించగా, ఆయన భార్యకళావతికి రూ. 19,800, జూన్ 13న నరసింహులు చనిపోగా...ఆయన భార్య వరలక్ష్మికి రూ. 5,11,200, జూన్ 2న తిరుపాల్ నాయక్ మృతి చెందగా.. కుటుంబసభ్యురాలు శాంతమ్మకు రూ. 31,800, జూన్‌లో రిటైర్డ్ అయిన నూర్ మహమ్మద్‌కు రూ. 5,09,780, మేలో రిటైర్డ్ అయిన క్రిష్ణవేణికి రూ.53,400లు అందించారు. ఈ మేరకు వారికి చెక్కులు అందజేశారు.

వన్య ప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అటవీఅధికారులు

గార్లదిన్నె, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): వన్యప్రాణుల సంరక్షణ ను అందరు బాధ్యతగా తీసుకోవాలని అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ అక్బర్ సూచించారు. వన్య ప్రాణుల వారోత్సవాల్లో భాగంగా మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో సోమవారం ఆయన విద్యార్థులకు వన్య ప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రకృతిలో వన్యప్రాణులు ఎంతో ముఖ్యమైనవన్నారు. పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో, మనిషి జీవితానికి అవసరమైన వనరులను అందించడంలో వన్యప్రాణులు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. అడవులను కాపాడడంతోపాటు వన్యప్రాణులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని అన్నారు. వన్యప్రాణులను, అడవులను కాపాడడం అందరు బాధ్యతగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సాకే సతీష్, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

శింగనమల, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి ఆర్చరీ వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు శింగనమల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. గతవారంలో జిల్లాస్థాయి పోటీలు జిల్లాకేంద్రంలో నిర్వహించారు. ఇందులో అండర్ - 17 బాలికల విభాగంలో పాఠశాలకు చెందిన సుస్మిత, లావణ్య, నిహారిక, హాసిని, బాలుర విభాగంలో యోగేంద్రరెడ్డి, బోయ హర్షకుమార్ ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ విద్యార్థులను ప్రధానోధ్యాయురాలు చంద్రకళ, వ్యాయామ ఉపాధ్యాయులు సునీత, ఉపాధ్యాయులు సోమవారం పాఠశాలలో అభినందించారు.

'సుప్రీం జడ్జిపై దాడి.. పిరికిపంద చర్య'



మాట్లాడుతున్న సాకే నరేష్

అనంతపురం క్రైం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై జరిగిన దాడి పిరికిపంద చర్య అంటూ బీసీ రిజర్వేషన్ల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు సాకే నరేష్ పేర్కొన్నారు. నగరంలోని సంఘం కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దాడిని ఖండించారు. సుప్రీం కోర్టు మన దేశంలో ప్రజాస్వామ్యానికి ప్రాణం వంటిదని, న్యాయం కోరిన ప్రతి పౌరుడి చివరి అడుగు అత్యున్నత ధర్మాసనమైన సుప్రీం కోర్టు వైపు పడుతుందని అన్నారు. హక్కులు, స్వేచ్ఛ, భద్రతను కాపాడే సుప్రీం కోర్టుకు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ గవాయ్‌పై దాడి చేయడం దారుణమన్నారు. ఇది వ్యక్తిపై చేసిన దాడి కాదని, దేశ రాజ్యాంగంపై, ప్రజాస్వామ్యంపై జరిగిన దాడి అని పేర్కొన్నారు.

సీజేఐ గవాయ్‌పై దాడికి ఖండన

అనంతపురం క్లాక్‌టవర్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆలిండియా ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ తెలిపారు. ఎంతటి ఉన్నతస్థాయిలో ఉన్నా.. కుల వివక్షత వెంటాడుతూ ఉంటుందనేందుకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై దాడి చేయాలని యత్నించడమే నిదర్శనమని అన్నారు. దీనిని ప్రజాస్వామ్యం మీద దాడిగా పరిగణించాలన్నారు. దాడికి యత్నించిన న్యాయవాదిపై దేశద్రోహం కేసు పెట్టి శిక్ష వేయాలని డిమాండ్ చేశారు.

ఘనంగా వాల్మీకి మహర్షి జయంత్యుత్సవాలు



ప్రత్యేక అలంకరణలో వాల్మీకి విగ్రహం

రాప్తాడు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని బండమీదపల్లి గ్రామంలో వాల్మీకి మహర్షి జయంతి ఉత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, వాల్మీకి కులస్థులు స్థానిక వాల్మీకి మహర్షి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం సాయంత్రం వాల్మీకి చిత్రపటాన్ని పల్లకిలో ఉంచి గ్రామ వీధుల్లో ఊరేగించారు. మహిళలు జ్యోతులు ఎత్తుకుని పెద్దఎత్తున ఊరేగింపులో పాల్గొన్నారు.

మాతా ఫుడ్స్‌కు స్వచ్ఛాంధ్ర అవార్డు



ఎంపీ చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న పసుపుల హనుమంతరెడ్డి

బుక్కరాయసముద్రం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని మాతా ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి స్వచ్ఛాంధ్ర అవార్డు దక్కింది. ఈ మేరకు సోమవారం జిల్లాకేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో ఈ అవార్డును ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, జేసీ శివనారాయణ శర్మ ఆ కంపెనీ డైరెక్టర్ పసుపుల హనుమంతరెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా కంపెనీ ఛైర్మన్ పసుపుల శ్రీరామిరెడ్డి, డైరెక్టర్లు పసుపుల హనుమంతురెడ్డి, పసుపుల నారాయణరెడ్డి మాట్లాడుతూ పరిశ్రమ ఏర్పడినప్పటి నుంచి ఆహార నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నామమని, ఎప్పటికప్పుడు పారిశుధ్య, పరిశుభ్రత చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వీటితో పాటు కంపెనీ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టామని, వీటిని ప్రభుత్వం గుర్తించి ఈ అవార్డును అందజేసిందని , ఇది ఎంతో సంతోషదాయకమని పేర్కొన్నారు.

ఘనంగా అనంతేశ్వరస్వామి కల్యాణం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితుడు

అనంతపురం టౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): లోకకల్యాణం కోసం శారదానగర్‌లోని శివబాల యోగి ఆశ్రమంలో సోమవారం అనంతేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు భక్తుల చేత అనంతేశ్వరస్వామి, అనంతేశ్వరి మాత ఉత్సవ మూర్తులతో ప్రాకారోత్సవం చేయించారు. అనంతరం ఆలయ ఆవరణలో ఆ విగ్రహాలకు ప్రత్యేక అలంకరణలు చేసి వేదమంత్రోచ్ఛారణల నడుమ కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. తొలుత స్వామి అమ్మవారి మూలవిరాట్‌లకు ప్రత్యేక అలంకరణలు, విశేష పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు జూటూరు అరవింద్, ఉపాధ్యక్షుడు రత్నగిరి దేవరాజ్, కార్యదర్శి మల్లికార్జున, కార్యవర్గ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నవరాత్రుల విజయవంతంపై సంబరాలు



ఆలయ ప్రధాన అర్చకుడు, కమిటీ సభ్యులను సత్కరిస్తున్న దృశ్యం

అనంతపురం టౌన్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): నవయుగ కాలనీలోని పెద్దమ్మ ఆలయంలో గత సెప్టెంబరు 22 నుంచి ఈనెల 2వ తేదీ వరకు దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించడం పట్ల సోమవారం ఆలయ ఆవరణలో సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా అనంతపురం రూరల్ విద్యుత్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు మాధవరెడ్డి, వెంకటనారాయణ, శ్రీనాథ్‌రెడ్డి, శ్రీరాములు, బాషా, ఖలందర్‌లు ఆలయ ప్రధానార్చకుడు రాజుతోపాటు కార్యవర్గ సభ్యులను శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు. అనంతరం ఆలయ ఆవరణలో భక్తులందరికీ అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రెడ్డమ్మ, భారతి, జయలక్ష్మి, వరలక్ష్మి, చామంతి, లక్ష్మి, భూలక్ష్మి, రోజా, సుహాసిని, విజయ్, మల్లికార్జున, సాయి, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యదేవుడి వ్రతం



వ్రతాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు

అనంతపురం టౌన్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఆశ్వీయుజ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం సాయంత్రం నగర శివారులోని శివకోటి ఆలయంలో సత్యదేవుని వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు ఆలయ ఆవరణలోని వేదికపై సత్యనారాయణ స్వామి ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి వేద మంత్రోచ్ఛారణల నడుమ వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. తర్వాత మహామంగళహారతి నివేదనానంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ప్రకాష్ రెడ్డీ.. నోరు అదుపులో పెట్టుకో..

- పరిటాల కుటుంబంపై ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే సహించం
- మాజీ ఎమ్మెల్యేకు టీడీపీ నాయకుల హెచ్చరిక

చెన్నేకొత్తపల్లి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి నోరు అదుపులో పెట్టుకోవాలని, పరిటాల కుటుంబంపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని టీడీపీ మండల నాయకులు హెచ్చరించారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం మండల కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దండు ఓబులేశు తదితరులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఎమ్మెల్యే పరిటాలసునీత, యువనేత పరిటాలశ్రీరామ్‌పై చేసిన ఆరోపణలను ఖండిస్తున్నామన్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు రాప్తాడు నియోజకవర్గంలో దోచుకోవడం, దాచుకోవడం తప్పా మీరు ఏమి వెలగబెట్టారో ప్రజలందరికీ తెలుసన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే ఎమ్మెల్యే పరిటాల సునీత నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి మీకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. మరోసారి పరిటాల కుటుంబంపై నోటికి వచ్చినట్టు మాట్లాడితే ఊరుకోమని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు అంకే అమరేంద్ర, ముత్యాలప్ప, గుడిపల్లి రామాంజి, వడ్డే దుర్గా, రాజు, చెన్నకేశవులగౌడ్, నాగరాజు, అశ్వర్థరెడ్డి, భార్గవ, మల్లికార్జున, పూజారి నరసింహులు పాల్గొన్నారు.

● రాప్తాడు: మండలకేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో ఎస్సీ సెల్ రాప్తాడు నియోజకవర్గ అధికార ప్రతినిధి గంజి నరేష్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ప్రకాష్‌రెడ్డి పరిటాల కుటుంబంపై చేసిన వ్యాఖ్యలను ఖండించారు. ఎమ్మెల్యే పరిటాల సునీత 50 వేల ఇళ్లు రద్దు చేశారని, ఇళ్ల లబ్ధిదారులతో ఒక్కొక్కరి నుంచి రూ.10 వేలు వసూలు చేశారని ప్రకాష్‌రెడ్డి అసత్య ఆరోపణలు చేశారని, వాటిని ఆయన నిరూపించాలని, లేకపోతే ఈ నెల 25న అతడి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. పరిటాల సునీత, ఆమె కుటుంబ సభ్యులు రాప్తాడు నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎల్లవేళలా కృషి చేస్తున్నారని అన్నారు. మరోసారి పరిటాల కుటుంబంపై ఇలాంటి ఆరోపణలు చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. దళిత సైన్యం స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ ముత్యాలు, నాయకులు రాధాకృష్ణ, కదిరప్ప, నరేష్, నాగరాజు, శేఖర్, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

● ఆత్మకూరు : పరిటాల కుటుంబంపై తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి నోరు పారేసుకోవడం తగదని టీడీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు మండిపడ్డారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత వైసీపీ పాలనలో రాప్తాడు నియోజకవర్గంలో తోపుదుర్తి సోదరులు చేసిన అక్రమాలు అన్నీ ఇన్నీ కావన్నారు. వారి వల్ల ఎంతోమంది రోడ్ల పాలయ్యారన్నారు. ఇప్పుడు నియోజకవర్గ అభివృద్ధికి పాటు పడుతున్న పరిటాల కుటుంబంపై ప్రకాష్‌రెడ్డి అవాస్తవాలు మాట్లాడడం తగదన్నారు. ఇకపై ఇలాగే నోరు పారేసుకుంటే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు కందుల ఓబుళపతి, అక్కులన్న, పూల ఓబుళపతి, ఆనంద్, ఆదెప్ప, సుధాకర్ తదితరులు పాలొన్నారు.



సీకేపల్లిలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు



రాప్తాడులో..



ఆత్మకూరులో..

న్యూస్ బాక్స్

జిల్లా స్థాయి స్వచ్ఛాంధ్ర అవార్డులు



అవార్డు అందుకుంటున్న సర్పంచ్ అనూరాధ, డిప్యూటీ ఎంపీడీఓ శశికళ

యాడికి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): యాడికి గ్రామపంచాయతీ స్వచ్ఛ ఆంధ్ర జిల్లాస్థాయి అవార్డుకు ఎంపికైంది. అనంతపురంలోని అలెగ్జాండర్ భవనంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో డిప్యూటి ఎంపీడీఓ శశికళ, సర్పంచు అనురాధకు అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, జాయింట్ కలెక్టర్ శివన్నారాయణ శర్మ స్వచ్ఛ ఆంధ్ర అవార్డు అందజేశారు.

బెళుగుప్ప కేజీబీవీకి...

● బెళుగుప్ప : స్థానిక కేజీబీవీ పాఠశాలకు జిల్లాస్థాయి స్వచ్ఛ భారత్ అవార్డు లభించింది. దీంతో కేజీబీవీ ఎస్ఓ నాగరత్నబాయికి అనంతపురంలో ఎంపీ అంబిక లక్ష్మీనారాయణ, జాయింట్ కలెక్టర్ శివన్నారాయణశర్మ ఆ అవార్డు అందజేశారు.



అవార్డు అందుకుంటున్న ఎస్ఓ నాగరత్నబాయి

ఉంతకల్లు గ్రామ పంచాయతీకి..

● బొమ్మనహాళ్ : ఉత్తమ స్వచ్ఛ గ్రామంగా మండలంలోని ఉంతకల్లు గ్రామ పంచాయతీ ఎంపికైంది. దీంతో ఆ గ్రామ సర్పంచ్ ముక్కన్న, ఎంపీడీఓ విజయభాస్కర్, పంచాయతీ కార్యదర్శి పల్లవికి ఆ అవార్డును ఎంపీ, జేసీ అందజేశారు. అలాగే ఉత్తమ హరిత రాయబారిగా కొల్లాపురి అవార్డు అందుకున్నారు.



అవార్డు అందుకుంటున్న సర్పంచ్ ముక్కన్న, ఎంపీడీఓ విజయభాస్కర్

గుత్తి జడ్పీ పాఠశాలకు...

●గుత్తి : పట్టణంలోని కోట వీధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు జిల్లాస్థాయి స్వచ్ఛ భారత్ అవార్డు దక్కింది. దీంతో ఆ పాఠశాల హెచ్ఎం సుభాన్‌కు సోమవారం అనంతపురంలో ఎంపీ, జేసీ ఆ అవార్డు అందజేశారు.



అవార్డు అందుకుంటున్న హెచ్ఎం సుభాన్

పుట్లూరు ఆదర్శ పాఠశాలకు...

● పుట్లూరు : స్థానిక ఆదర్శ పాఠశాలకు జిల్లాస్థాయిలో స్వచ్ఛ పాఠశాలల విభాగంలో అవార్డు వచ్చింది. సోమవారం ఆ పాఠశాల ప్రిన్సిపాల్ ఓబులరెడ్డికి అనంతపురంలో ఎంపీ, జాయింట్ కలెక్టర్ ఆ అవార్డు అందజేశారు.



అవార్డు అందుకుంటున్న ప్రిన్సిపాల్ ఓబులరెడ్డి

పామిడి సీహెచ్‌సీకి...

● పామిడి: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)కి స్వచ్ఛ ఆంధ్ర అవార్డు వచ్చింది. దీంతో ఆ సీహెచ్‌సీ స్వచ్ఛ ఆంధ్ర ఆఫీసర్ డాక్టర్ కమలాకర్‌కు ఎంపీ ఆ అవార్డును అందజేశారు.



అవార్డు అందుకుంటున్న డాక్టర్ కమలాకర్

గజవాహనంపై చింతలరాయుడు



తాడిపత్రి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ చింతల వెంకటరమణస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారు గజ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా శ్రీవారి ఉత్సవమూర్తికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పోస్టర్ విడుదల

గుంతకల్లుటౌన్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఈనెల 8న తిరుపతిలో నిర్వహించే నిరవధిక సమ్మె పోస్టర్‌ను విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ జేఏసీ విద్యుత్ శాఖ గుత్తి డివిజన్ నాయకులు షాషావలి, రాంప్రసాద్, నాయకులు స్థానిక ఆలూరు రోడ్డులోని ఏడీఏ కార్యాలయం వద్ద ఆ సమ్మె పోస్టర్లను విడుదల చేశారు.

సమస్యలు పరిష్కరించండి

బెళుగుప్ప, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని ఏపీఎం సురేఖకు, మండల సమాఖ్య అధ్యక్షురాలు భాగ్యమ్మకు వెలుగు యానిమేటర్లు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఇందులో ధర్మతేజ యానిమేటర్ల యానియన్ అధ్యక్షుడు శివకుమార్, కార్యదర్శి గణేష్ పాల్గొన్నారు.

రాయల ప్రతిబింబం

శ్రీకృష్ణదేవరాయల పాలనకు ప్రతిబింబంలా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోంది. యాడికి మండలంలోని రాయలచెరువు చెరువుకు గత వైసీపీ హయాంలో కొద్దిపాటి నీరు వచ్చేవి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చెరువులను నీటితో నింపే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా పదిరోజుల క్రితం తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి కిష్టిపాడు హెడ్ రెగ్యులేటరీ వద్ద నుంచి యాడికి కాలువకు, ఈ చెరువుకు నీటిని విడుదల చేశారు. తుంగభద్రజలాలు రావడంతో అనేక సంవత్సరాల తర్వాత ఈ చెరువులో చిన్నతూము మునిగే వరకు నీళ్లు వచ్చాయి. దీంతో రైతులు ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. సోమవారం సాయంత్రం సూర్యాస్తమయం వేళ కోనసీమను తలపించేలా ఏర్పడిన ఈ సుందర దృశ్యం చూపరులకు కనువిందు చేసింది.

- యాడికి (ఆంధ్రజ్యోతి)



రాయలచెరువు నీటిలో సూర్యుడి ప్రతిబింబం

సమాచారం అడిగితే కేసు పెడతారట..!

వజ్రకరూరు కార్యదర్శి బెదిరింపుపై జేసీకి వార్డు సభ్యుడి ఫిర్యాదు

వజ్రకరూరు(ఉరవకొండ), అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): సమాచారం అడిగితే ఎస్సీ యాక్టు కేసు పెడతానని వజ్రకరూరు కార్యదర్శి మల్లయ్య బెదిరిస్తున్నారని వార్డు సభ్యుడు మల్లికార్జున రెడ్డి వాపోయారు. దీనిపై అనంతపురంలోని ప్రజాసమస్యల పరిష్కార వేదికలో సోమవారం జాయింట్ కలెక్టర్ శివ నారాయణశర్మకు ఫిర్యాదు చేశారు.



జేసీకి ఫిర్యాదు చేస్తున్న మల్లికార్జునరెడ్డి

కనీసం వార్డు సభ్యులకు గౌరవం వేతనం అందలేదని, 2021 నుంచి 2025 వరకూ 15ఫైనాన్స్ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలు లేవని, వీటి గురించి అడిగితే.. కార్యదర్శి ఎస్సీ యాక్టు కేసు పెడతానని బెదింపులకు పాల్పడుతున్నాడని తెలిపారు.

మూడేళ్లుగా పింఛన్ కోసం పాట్లు



బొమ్మనహాళ్ తహసీల్దార్ కార్యాలయం వద్ద వన్నూరమ్మ

బొమ్మనహాళ్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): 'మాది ఉంతకల్లు గ్రామం. నా కుమారుడికి చిన్నతనం నుంచే మాటలు రావు. మానసిక వికలాంగుడు. మా ఇంట్లో వృద్ధురాలు ఉండటంతో గత ప్రభుత్వ హయాంలో ఆమెకు మాత్రమే పింఛన్ వచ్చేంది. కొత్త ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి నా కుమారుడికి పింఛన్ కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా. మా ఇంట్లో ఉన్న వృద్ధురాలూ చనిపోయారు. నా కొడుకు మందుల కోసం, చికిత్స కోసం ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఎన్నిసార్లు తిరిగినా అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈ రోజు కూడా తహసీల్దార్ సార్‌ను విజ్ఞప్తి చేశాను. అధికారులు స్పందించి.. మాకు న్యాయం చేయాలి.' అని వన్నూరమ్మ స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం విలపించారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక



పయ్యావుల శ్రీనివాసులు సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

కూడేరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముద్దలాపురం గ్రామానికి చెందిన 12 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. సోమవారం అనంతపురంలోని ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ క్యాంపు కార్యాలయంలో ముద్దలాపురానికి చెందిన పి. రమేష్, లక్ష్మీనారాయణ, ధనుంజయ్య, వెంకటేష్, హరీష్, భాస్కర్, వినయ్ తదితర కుటుంబాలకు చెందిన వైసీపీ కార్యకర్తలు టీడీపీ నేత పయ్యావుల శ్రీనివాసుల సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గడిపూటి వెంకటేష్, సిద్దయ్య, గోపాల్, నారాయణస్వామి పాల్గొన్నారు.

వైసీపీది అసత్య ప్రచారం: టీడీపీ



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

ఉరవకొండ, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఆమిద్యాల లిఫ్ట్ ఇరిగేషన్‌కు మంత్రి పయ్యావుల కేశవ్ కృషి చేస్తే.. అది తమ ఘనతే అని వైసీపీ నాయకులు అసత్య ప్రచారం చేసుకోవడం విడ్డూరంగా ఉందని మండల టీడీపీ నాయకులు విమర్శించారు. మండలంలోని రాకెట్లలో టీడీపీ నాయకులు నెట్టెం రాము, నరేంద్ర సోమవారం మాట్లాడుతూ... ఐదేళ్ల వైసీపీ పాలనలో రైతులకు పరిహారం ఎందుకు ఇప్పించలేకపోయారని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలలకే పరిహారం ఇప్పించిన ఘనత కేశవ్‌దే అన్నారు. పరిహారం వైసీపీ నియోజక వర్గ ఇన్‌చార్జీ కుటుంబసభ్యులకు కూడా జమ అయిందన్నారు. ఇప్పటికైనా వైసీపీ అసత్య ప్రచారాలు మానుకోవాలన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు సుదర్శన్, నర్రా వెంకటేశులు, వెంకటరాముడు, సుంకన్న, రాజేష్, అశ్విన్ కుమార్ పాల్గొన్నారు.

సచివాలయంలో సమయ పాలనేదీ.?

ఉదయం 11 గంటలైనా తెరవని తలుపులు



సచివాలయం వద్ద వేచి ఉన్న గ్రామస్థులు

కుందుర్పి, అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): మండలంలోని జంబుగుంపల మారుమూల గ్రామంలో ఉన్నతాధికారులు పర్యవేక్షణ ఉండదు. దీంతో సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించడం లేదు. ఆ ఉద్యోగులు ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు వెళతారో తెలియని పరిస్థితి నెలకొంది. సోమవారం ఉదయం 11 గంటలైనా సచివాలయ తలుపులు తెరవలేదు. వివిధ పనుల నిమిత్తం వచ్చిన ప్రజలు సిబ్బంది కోసం నిరీక్షించి.. విసిగిపోయి వెనుతిరిగారు. ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి ఉండటంతో పాలన ఇలా ఉందని, రెగ్యులర్ కార్యదర్శిని నియమించాలని ఆ గ్రామస్థులు కోరుతున్నారు.

కార్పొరేట్ సెలూన్ షాపులు తొలగించాలి

గుంతకల్లు టౌన్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలో కార్పొరేట్ సెలూన్ షాపులను తొలగించాలని మున్సిపల్ చైర్ పర్సన్ ఎన్ భవానికి క్షవర వృత్తిదారుల సంఘం నాయకులు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఇందులో క్షవర వృత్తిదారుల సంఘం అధ్యక్షుడు బెలగంటి లక్ష్మీనారాయణ, కోశాధికారి బ్రహ్మ, సభ్యులు శంకర్, నీలాకుమార్, నరేష్, అజయ్, అంజి, సాయి, వాసు, శివ, సురేంద్ర, బాల పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కల్పించండి

బొమ్మనహాళ్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గింపుపై ప్రజలకు కలిగే లాభాలపై వారికి అవగాన కల్పించాలని తహసీల్దార్ మునివేలు, ఎంపీడీఓ విజయభాస్కర్ సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల, గ్రామ స్థాయి అధికారులు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన సదస్సులో వారు మాట్లాడారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు.

● గుత్తి : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జీఎస్టీపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఇందులో ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్, తహసీల్దార్ పుణ్యవతి, ఏఓ ముస్తాక్ ఆహ్మద్, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

● గుమ్మఘట్ట : మండలంలోని తాళకేర గ్రామంలో మత్స్యసహకార సంఘం భవనంలో మత్స్యకారులకు జీఎస్టీపై సోమవారం అవగాహన కల్పించారు. ఇందులో ఎంపీడీఓ జయరాములు, మత్స్యశాఖ అధికారి హనీఫ్, మత్స్యసహకార సంఘం అధ్యక్షుడు బెస్త శ్రీరాములు, కార్యదర్శి సత్యనారాయణ పాల్గొన్నారు.

● కళ్యాణదుర్గంరూరల్ : స్థానిక ఎస్పీసీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జీఎస్టీపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో డైరెక్టర్ డాక్టర్ ఎస్ భరత్ గుప్తా, కళాశాల ప్రిన్సిపాల్ హర్షలత, శ్రీకాకుళం జిల్లా తుగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం సత్యనారాయణరావు పాల్గొన్నారు.

ఇన్‌ఫ్లో 2,710 క్యూసెక్కులు

బెళుగుప్ప, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో 2,710 క్యూసెక్కులు, ఔట్‌ఫ్లో 2,670 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు సోమవారం తెలిపారు. రిజర్వాయర్‌లో ప్రస్తుతం 1.743 టీఎంసీల నీరు ఉందని, ఫేజ్-2కు 1,390 క్యూసెక్కుల నీరు వెళ్తోందని తెలిపారు.

క్రీడాకారులకు అభినందన



క్రీడాకారులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

గుంతకల్లుటౌన్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): పోలాండ్‌లో ఈ ఏడాది జూన్ 18 నుంచి 28 వరకు జరిగిన అంతర్జాతీయ సాఫ్ట్ టెన్నిస్ టోర్నమెంట్‌లో స్థానిక శ్రీ శంకరానందగిరిస్వామి డిగ్రీకళాశాల బీసీఏ విద్యార్థి అరోస్ రొనాల్డియన్‌హో బంగారు పతకం సాధించాడు. అలాగే విజయవాడలో సెప్టెంబరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి సాఫ్ట్ టెన్నిస్ చాంపియన్ షిప్ పోటీలోనూ బంగారు పతకం సాధించాడు. అదే కళాశాలలో బీసీఏ చదువుతున్న భానుప్రకాష్ సాఫ్ట్ టెన్నిస్ పోటీలో సిల్వర్ సాధించారు. ఈ ఇద్దరి క్రీడాకారులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్లు సోమవారం అభినందించారు.

సామాజిక తనిఖీ ప్రజావేదిక



సమావేశంలో పాల్గొన్న జిల్లా అధికారులు

శెట్టూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మండలవ్యాప్తంగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నిర్వహించిన ఉపాధి హామీ పనులపై సామాజిక బృందం వారు సామాజిక తనిఖీ నిర్వహించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ పంచాయతీల వారిగా అక్రమాలను బహిర్గతం చేశారు. అక్రమాలకు పాల్పడిన ఉపాధి సిబ్బందిపై జిల్లా పీడీ సలీంబాష మండిపడ్డారు. నిర్లక్ష్యంగా విధులు నిర్వహించిన సిబ్బందికి షోకాజ్ నోటీసులు అందజేస్తామని, క్రమశిక్షణ చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ పీడీ సుధాకర్‌రెడ్డి, జిల్లా విజిలెన్స్ ఆఫీసర్ శ్రీనివాసులు, అబుడ్స్‌మెన్ శివారెడ్డి, ఎంపీడీఓ జిలాని బాష పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో అనర్థాలపై అవగాహన

కళ్యాణదుర్గం రూరల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలను తీసు కోవడం కలిగే అనర్థాలపై స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో పోలీసులు సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మూర్తి, కృష్ణారెడ్డి, భాగ్యమ్మ, విజయకుమారి, అరుణ, వ్యాయామ ఉపాధ్యాయుడు చల్లా కిరణ్ చౌదరి పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా అస్రత్ వలీ



కుందుర్పి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): కుందుర్పి జ్యోతిరావుపూలే గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా అస్రత్ వలీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి ప్రిన్సిపాల్ శ్రీనివాస్ పేరూరు గురుకుల పాఠశాల ఆంగ్ల టీచరుగా బదిలీపై వెళ్లారు. కొనకొండ్ల జ్యోతిరావుపూలే గురుకుల పాఠశాల నుంచి అస్రత్ వలీ ఇక్కడికి వచ్చారు.

క్రైం న్యూస్..

నిప్పంటుకుని వృద్ధుడి మృతి

తాడిపత్రి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గురులాడ్జీ సమీపంలో నివాసముంటున్న వడ్డె వెంకటేష్ (75) నిప్పంటుకొని మరణించాడు. సోమవారం మద్యం తాగిన ఇతను మత్తులో ఇంటివెనుక ఉన్న చెత్తలో నిద్రపోయాడు. ఆ చెత్తకు నిప్పు అంటుకోవడంతో ఆ మంటలు వెంకటేష్‌కు వ్యాపించాయి. అతను కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు గమనించి.. మంటలు ఆర్పి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అప్పటికే అతను మరణించినట్లు వైద్యులు తెలిపారు. వెంకటేష్‌కు భార్య బాలమ్మ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

చికిత్స పొందుతూ..

పామిడి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక పామిడమ్మ వీధిలో నివాసముంటున్న వెంకటేష్(50) కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మరణించాడు. ఇతను సెప్టెంబరు 16న సొరకాయలపేట-పెన్నప్ప గుడి మధ్య మలుపులో బైక్ అదుపు తప్పి కిందపడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. పామిడి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగుళూరు తరలించారు. అక్కడి నుంచి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మరణించాడు. అతనికి భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

కూడేరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఉరవకొండ వైపు నుంచి కర్ణాటక రాష్ట్రానికి బొలేరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న దాదాపు 1,460 కిలోల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు మండలం జల్లిపల్లి వద్ద సోమవారం స్వాధీనం చేసుకున్నారు. ఆ వాహనాన్ని కూడేరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బియ్యాన్ని సీఎస్‌డీటీ శాంతకు అప్పగించినట్లు విజిలెన్స్ సీఐ జమాల్ బాషా తెలిపారు. వాహన డ్రైవర్ పరారీలో ఉన్నాడని, క్రిమినల్ కేసు నమోదు చేశామని చెప్పారు.

● ఉరవకొండ : పట్టణ శివారులోని ఓ లేఅవుట్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు 40 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు, రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆ బియ్యాన్ని సివిల్ సప్లై గోడౌన్‌కు తరలించారు. బియ్యాన్ని ఎవరు ఇక్కడ నిల్వ చేశారనేది తెలియాల్సి ఉందని ఆర్ఐ రామకృష్ణ తెలిపారు.

ఇద్దరి అరెస్ట్

తాడిపత్రి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాల్వగడ్డ వీధిలో సుల్తాన్‌పై రహంతుల్లా, ఖాజా సెప్టెంబరులో దాడిచేసిన విషయం తెల్సిందే. సోమవారం వారిని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు పంపినట్లు పట్టణ సీఐ ఆరోహణరావు తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

గుమ్మగట్ట, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేదావతి హగరి నుంచి కర్ణాటక ప్రాంతానికి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లును ఆదివారం రాత్రి రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ మండలంలోని తాళకేర వద్ద సీజ్ చేశారు. కేసు నమోదు చేసి.. ఆ ట్రాక్టర్లు సీజ్ చేసినట్లు చెప్పారు.

కనకదాస సర్కిల్‌ను అభివృద్ధి చేద్దాం



విరాళాలు అందజేస్తున్న కురుబలు

కళ్యాణదుర్గంరూరల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక హిందూపురం బైపాస్ రోడ్డులో త్వరలో ప్రారంభించనున్న కనకదాస సర్కిల్ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కురుబలు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక కురుబ కళ్యాణ మండపంలో కురుబ కులస్థులు సమావేశం నిర్వహించారు. ఆ సర్కిల్ ప్రారంభోత్సవంపై చర్చించారు. అభివృద్ధికి వారు విరాళాలు అందజేశారు. కనకదాసు కాంస్య విగ్రహానికి దాదాపు రూ.పది లక్షలు సొంత నిధులు ఇచ్చిన ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుకు, కనకదాసు కళ్యాణ మండప నిర్మాణాన్ని పూర్తి చేయడానికి రూ.25 లక్షలు మంజూరు చేసిన హిందూపురం పార్లమెంట్ సభ్యుడు బీకే పార్థసారథికి వారు ధన్యవాదాలు తెలిపారు.

విద్యుత్ కార్మికుల సమ్మె నోటీసు



విద్యుత్ ఈఈకి సమ్మె నోటీసు అందజేస్తున్న కార్మికులు

గుత్తి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యుత్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఈ నెల 15 నుంచి నిరవధిక సమ్మె చేపడుతామని ఏపీ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు స్పష్టం చేశారు. ఈ మేరకు స్థానిక విద్యుత్ ఈఈ పద్మానాభపిళ్లైకు సోమవారం సమ్మె నోటీసు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షుడు ఏవీ రమణ, చైర్మన్ రాంప్రసాద్, కన్వీనర్ షాషావలి, 1104 కార్యదర్శి నాగేంద్రప్రసాద్, ప్రహ్లాద, వెంకటేశ్వర్లు, తిరుమల, చిన్న, బాషా పాల్గొన్నారు.

పేదలకు ఇంటి స్థలాలివ్వాలి



మాట్లాడుతున్న ఏఐకేఎంఎస్ నాయకులు

కూడేరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని నిరుపేదలకు ఇంటి స్థలం కేటాయించాలని ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని బ్రహ్మణపల్లి గ్రామ సమీపంలోని 93 సర్వేనంబర్‌లో దాదాపు 134 ఎకరాలకు పైగా చెరువు భూమిలో ఉన్న కంపచెట్లను పేదలతో కలిసి తొలగించారు. నాగరాజు మాట్లాడుతూ.. రెవెన్యూ రికార్డులో ఇది చెరువు భూమిగా నమోదు అయిందని, కొందరు అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారని, అలాంటి వారిపై తక్షణం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అన్యాక్రాంతమైన చెరువు భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని.. పేదలకు కేటాయించాలని కోరారు. ఇందులో నాయకులు రాయుడు, కిష్ట, శివయ్య, రామాంజినేయులు, రాజశేఖర్ పాల్గొన్నారు.

సాగుభూమి ఇవ్వండి

బొమ్మనహాళ్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని దళిత కుటుంబాలకు సాగుభూమి ఇవ్వాలని భారతీయ అంబేద్కర్ సేన జిల్లా యువసేన అధ్యక్షుడు కేసీ పవన్ స్థానిక తహసీల్దార్ మునివేలుకు సోమవారం వినతి పత్రం అందజేశారు.